ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 3 మే 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 45.0 30.0

ఉడుకు నెత్తురు ఉప్పెనైతే..!

ఎన్నికల్లో వైసీపీ గల్లంతు ఖాయం

- నోటిఫికేషన్‌లు లేక పెరిగిన నిరుద్యోగిత
- పోటీ పరీక్షలకు సిద్ధమైనవారిలో నైరాశ్యం
- ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధం
- వైసీపీ అభ్యర్థులకు దడ పుట్టిస్తున్న యువత



వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపలేదు. ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకోలేదు. కరువు జిల్లా అనంతలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. యువత పొట్టచేతపట్టుకొని వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బటన్ నొక్కి... అంతా చేసేశామనే భ్రమలో జగన్ ఉన్నారని యువత మండిపడుతోంది. తీవ్ర అసంతృప్తితో ఉన్న యువత.. ఈ ఎన్నికల్లో కీలక తీర్పునిచ్చేందుకు సిద్ధమౌతోంది.

ఆంధ్రజ్యోతి, అనంతపురం/సెంట్రల్

టీడీపీ కూటమి మేనిఫెస్టోలో యువతకు భరోసా కల్పించారు. వైసీపీ మేనిఫెస్టోలో మరోమారు బటన్ నొక్కుడు అంశాలు తప్ప వేరే కనిపించలేదు. దీంతో అధికార పార్టీ అభ్యర్థులు డీలా పడ్డారు. గడిచిన ఐదేళ్లలో



వైసీపీ అభ్యర్థుల్లో దడ

యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు ఏవీ చేసింది లేదు. జిల్లాలో యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వీరందరూ తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారన్న గుబులు వైసీపీ అభ్యర్థుల్లో కనిపిస్తోంది. టీడీపీ హయాంలో... జిల్లాకు కియ పరిశ్రమ వచ్చింది. ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా మరో 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. ఇలాంటి పని ఐదళ్లలో వైసీపీ ఒక్కటీ చేయలేదు.

టీడీపీ భరోసా



టీడీపీ కూటమి విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోలో యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను హామీగా ఇచ్చారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా... ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. కూటమి తరఫున టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఉద్యోగం వచ్చేంత వరకు ఒక్కొక్కరికి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించారు. ఈ హామీ పట్ల యువతలో ఆసక్తి కనిపిస్తోంది. కూటమి అధికారంలోకి వస్తే తాము ఉద్యోగాలు పొందుతామన్న విశ్వాసం వారిలో వ్యక్తమౌతోంది.

యువతే.. భవిత



జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో యువ ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 20.18 లక్షల మంది ఓటర్లు ఉండగా.. అందులో 9,56,870 మంది యువ ఓటర్లు ఉన్నారు. ఇందులో తొలిసారిగా ఓటు వేయనున్నవారు 49,234 మంది ఉన్నారు. దాదాపు 48 శాతం మంది యువత ఓటర్ల తీర్పు ఈ ఎన్నికల్లో కీలకం కానుంది. వైసీపీ ఐదేళ్ల పాలనపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో యువతతోపాటు తొలి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్నవారు సైతం వైసీపీ అభ్యర్థులకు గుబులు పుట్టిస్తున్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	యువత
రాయదుర్గం	2,64,352	1,29,910
ఉరవకొండ	2,24,339	1,11,472
గుంతకల్లు	2,70,648	1,22,957
తాడిపత్రి	2,48,880	1,14,403
శింగనమల	2,47,373	1,17,464
అనంతపురం అర్బన్	2,81,214	1,20,684
కళ్యాణదుర్గం	2,30,785	1,20,802
రాప్తాడు	2,50,571	1,19,178





ఎంత కష్టం..

జగన్ పాలనలో అత్యధికంగా నష్టపోయింది నిరుద్యోగులే. ఉద్యోగం సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలని ఎంతో మంది తపించారు. రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. అందుకు ఊళ్లను వదిలి పట్టణాల్లో గదులను అద్దెకు తీసుకుని యజ్ఞం చేశారు. మూడు పూటలా తినడానికి లేక.. గుళ్లో ప్రసాదాలనే భోజనాలుగా సరిపెట్టుకున్నారు. ఎంతకాలం ఎదురుచూసినా నోటిఫికేషన్లు విడుదల కాలేదు. ఎన్నికల సమీపిస్తున్న క్రమంలో నిరుద్యోగుల ఓట్ల కోసం వైసీపీ ప్రభుత్వం అరకొరగా కానిస్టేబుల్, ఉపాధ్యాయ, వర్సిటీ టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. వాటిని కూడా భర్తీచేయకుండా కోర్టుల్లో కేసులు వేయించి, న్యాయస్థానాలపై నెపం నెట్టేసి చేతులు దులుపుకుందని నిరుద్యోగ యువత మండిపడుతోంది.

అంతా మోసం..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లు దండుకోవాలన్న దురుద్దేశంతో సీఎం జగన్.. కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఈవెంట్స్, ఆ తర్వాత మెయిన్స్ ఎగ్జామ్స్‌ను నిర్వహించాలి. కానీ కోర్టు కేసులతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. 1,979 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, 960 అసోసియేట్ ప్రొఫెసర్‌లు, 541 ప్రొఫెసర్‌లు.. మొత్తం 3,480 పోస్టుల భర్తీకి రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలకు గతేడాది అక్టోబరులో నోటిఫికేషన్ విడుదల చేశారు. నియామక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఏ అటంకాలు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుని నోటిఫికేషన్ విడుదల చేయాలి. కానీ నోటిఫికేషన్ తప్పులతడకగా రూపొందించారు. దీనిపై కొంతమందితో కోర్టులో ప్రభుత్వమే కేసులు వేయించిందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాలివ్వాలన్న ఉద్దేశం జగన్‌కు లేనందుకే నోటిఫికేషన్‌లు పారదర్శకంగా విడుదలచేయలేదని, కేవలం ఉద్యోగాలను ఆశచూపి సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేయించుకునేందుకు కుతంత్రాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కుర్చీలను మడతపెట్టి, పుస్తకాలను వదిలి వెళ్లిన నిరుద్యోగులు

జగన్ జాబ్ పోతుంది..

ముఖ్యమంత్రి జాబ్ నుంచి జగన్‌ను తొలగించేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారు. ప్రతి యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పడంతో యువత మోసపోయారు. నోటిఫికేషన్‌లు వస్తాయి, ఉద్యోగాన్ని కొడుతామని నిరుద్యోగులు ఐదేళ్లు ఎదురుచూశారు. సొంత ఊళ్లను వదిలి పట్టణాల్లో అద్దె గదుల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కష్టపడి పనిచేస్తూ అద్దెలు, పుస్తకాలకు డబ్బులు కట్టారు. వారి కష్టం వృథా అయ్యింది.



- రమణయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగాలు ఏవీ..?



ప్రజలను, యువతను మాయమాటలతో మోసంచేసే వైసీపీ ప్రభుత్వానికి ఉద్యోగాలివ్వడం చేతకాదు. ఈ ఎన్నికల్లో మళ్లీమోసం చేసేందుకు డీఎస్సీ, కానిస్టేబుల్, యూనివర్సిటీ ఉద్యోగాలంటూ పారదర్శకతలేని నోటిఫికేషన్‌లు ఇచ్చారు. వీటిపై జగనే పరోక్షంగా కోర్టుల్లో దావా వేయించి నిలుపుదల చేయించారు. న్యాయస్థానాలపై బురదజల్లుతున్నారు. ఐదేళ్ల పాలనలో ఉద్యోగాలు భర్తీచేయని అసమర్థుడిగా సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోయారు.

- తరిమెల గిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

వందలాది మంది ఉద్యోగుల మెడపై జగన్ ప్రభుత్వం, సమగ్రశిక్ష అధికారులు కత్తి పెట్టారు. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ముగిసిన వెంటనే ఒక రోజు బ్రేక్ ఇచ్చి.. ఆ ఏడాది కాలానికి ఉద్యోగుల కాంట్రాక్టును రెన్యువల్ చేసేవారు. అయితే ఈ ఏడాది 40 రోజులకు మాత్రమే రెన్యువల్ చేశారు. ఆ తర్వాత ఉద్యోగుల భవిష్యత్తు ఏమిటి...? కొనసాగిస్తారా..? ఉద్వాసన పలుకుతారా..? తేలాల్సి ఉంది. ఈ ఉత్తర్వులు ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. జగన్ ప్రభుత్వ నిర్ణయంపై కేజీబీవీ ఉద్యోగులు మండిపడుతున్నారు. - అనంతపురం విద్య

- కేజీబీవీ ఉద్యోగులతో ఆటలు
- జగన్ ప్రభుత్వ తీరుపై విమర్శలు

40 రోజుల ఉద్యోగం..!



కొత్త ఉత్తర్వుల మంటలు

జగన్ ప్రభుత్వం కొత్త ఉత్తర్వుల పేరిట ఉద్యోగులతో ఆడుకుంటోంది. సమగ్రశిక్ష ప్రాజెక్టు కింద పనిచేసే వేలాది మంది ఉద్యోగులను ఏటా ఏప్రిల్ 29న ఉద్యోగాల నుంచి తొలగించి, 30వ తేదీ గ్యాప్ ఇచ్చి మే 1వ తేదీ నుంచి రెన్యువల్ చేసేవారు. విద్యా సంవత్సరం ముగిసిన వెంటనే కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను ఏడాది కాలానికి రెన్యువల్ చేసేవారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్ష పరిధిలో పనిచేసే ఉద్యోగులందరికీ ఈ ఉత్తర్వులు వర్తించేవి. అయితే ఈ ఏడాది కొత్తగా 40 రోజుల ఉత్తర్వులు తేవడం విమర్శలకు తావిస్తోంది. కేజీబీవీల్లో పనిచేసే ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలకు మాత్రమే 2024-25 విద్యా ఏడాదికి 40 రోజుల గడువుతో రెన్యువల్ ఉత్తర్వులిచ్చారు. మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకూ 40 రోజులకు మాత్రమే ఆ కేటగిరీ ఉద్యోగులను రెన్యువల్ చేశారు.

ఈ మాత్రానికే..

రెన్యువల్ అగ్రిమెంట్లకు ఏటా రూ.100 బాండ్ల మీద ఉద్యోగులు రాసిచ్చేవారు. ఏడాది కాలానికి సరిపోయే రెన్యువల్ అది. కానీ ఈసారి కేవలం 40 రోజులకు రెన్యువల్ చేసినా.. జిల్ల సమగ్రశిక్ష అధికారులు బాండ్ అడుగుతున్నారు. అగ్రిమెంట్ కోసం ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఎవరూ అడగక పోయినా.. అనంతలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వెంటనే బాండ్ పేపర్లు ఇవ్వాలని, అప్పుడే జీతాలు బిల్లులు పెడతామని అంటున్నారు.

ఏడాదికి ఇవ్వాలి..

కేజీబీవీ ఉద్యోగులకు ఎప్పటిలాగా ఒక రోజు విరామంతో ఏడాదికి రెన్యువల్ చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులు 40 రోజుల బాండ్ అగ్రిమెంట్ ఇవ్వమని ప్రాజెక్టు అధికారులు బెదిరింపులకు దిగడం సరికాదు. ఏ ప్రభుత్వ శాఖలో ఎప్పుడూ లేనివిధంగా కేజీబీవీ ఉద్యోగులకు 40 రోజుల డెడ్‌లైన్‌తో ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయం. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి. మునుపటిలాగా ఏడాది కాలానికి ఉత్తర్వులివ్వాలి. - విజయ్, సమగ్రశిక్ష, కేజీబీవీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్



పోస్టల్ బ్యాలెట్‌కు 23,532 మంది దరఖాస్తు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 2: జిల్లాలో 23,532 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. ఇందు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోను రెండు ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల ఆరోతేదీ వరకు ఎన్నికల విధులకు నియమించబడ్డ టీచర్లు ఇతర అత్యవసర సేవలందించే శాఖల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఐదోతేదీ నుంచి ఏడు వరకు డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, ఈ నెల ఆరు నుంచి 8వరకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయాలని అన్నారు. పోలీసులకు ఈనెల 8 నుంచి 10 ప్రత్యేక బ్యాలెట్ పోలింగ్‌ను చేపట్టామన్నారు. అంతర్‌జిల్లాల్లో పని చేస్తున్న సిబ్బందికి 8న తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో అభ్యర్థుల నేర చరిత్ర

సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నేర చరిత్ర వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచినట్లు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే నామినేషన్లు వేసి పోటీలో ఉన్న అందరి అభ్యర్థులు తమ అఫిడవిట్లలో చూపిన మేరకు నేరచరిత్ర వివరాలు కలెక్టరేట్‌లోని నోటీస్‌బోర్డులో ఉంచినట్లు వివరించారు. అభ్యర్థుల అఫిడవిట్‌లలోని నేరచరిత్ర వివరాలు ఎన్కోర్ అనే వెబ్‌సైట్‌లో (అఫిడవిట్,ఈసీఐ, జీఓవి,ఇన్)ఉంచామని, ఎవరైనా తెలుసుకోవచ్చని కలెక్టరు తెలిపారు.

ఎంత ధైర్యంరా నీకు?

మా ఎదురుగానే పార్టీ కండువా వేసుకుని తిరుగుతావా..?

టీడీపీ కార్యకర్తపై ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరుడి దాడి



పగిలిన కారు అద్దం

చెన్నేకొత్తపల్లి, మే 2: టీడీపీ కండువా వేసుకుని మాకే ఎదురుగా వస్తావా? ఎంత ధైర్యంరా నీకు' అంటూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి, అతడి అనుచరులు టీడీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని గువ్వలగొందంపల్లిలో గురువారం జరిగింది. బాధితుడు టీడీపీ కార్యకర్త బెల్లం వేణుగోపాల్ తెలిపిన మేరకు.. తమ బంధువు చనిపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి పరామర్శించి తిరిగి కారులో స్వగ్రామమైన గువ్వలగొందంపల్లికి బయల్దేరారు. న్యామద్దల గ్రామ శివారులోకి రాగానే ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన సోదరుడు, అనుచరులు టీడీపీ కార్యకర్త కారులో ఉన్న టీడీపీ కండువాను చూసి దాడికి తెగబడ్డారు. కారులో ఉన్న బెల్లం వేణుగోపాల్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను నానా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురి చేశారు. అంతటితో ఆగకుండా కారు ముందు అద్దాన్ని రాళ్లతో ధ్వంసం చేశారు. కనీసం పార్టీ కండువాలు వేసుకుని తిరిగే స్వేచ్ఛ కూడా మాకు లేదా? ఎమ్మెల్యే సోదరుడి దౌర్జన్యంతో తన భార్య, పిల్లలు భయపడుతు న్నట్లు వేణుగోపాల్ తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి నుంచి ప్రాణహానీ ఉందని వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ ఘటనను టీడీపీ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్త, భార్య

ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, మే 2: నిరుద్యోగులు మునుపటిలాగానే ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి గురువారం ప్రకటనలో తెలిపారు. https: //employment.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ అర్హతలతో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ తరువాత రిజిస్ట్రేషన్ నంబరు ఎస్ఎంఎస్ వస్తుందని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నవారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.

రోగులకు నీరేదీ..?

గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తాగునీరు లేక రోగులు అల్లాడుతున్నారు. వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలరోజుల నుంచి చుక్క నీరు అందుబాటులో లేదు. తాగునీటి ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. రోగులు నీటిని బయట కొనాల్సి వస్తోంది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్ ద్వారా మెడికల్, లేబర్ వార్డుల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆ తరువాత ఆర్వో ప్లాంట్, తాగునీటి కొళాయిలను తొలగించారు. ఫార్మసీ స్టోర్ సమీపంలో, బయట రెండు నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటి ట్యాంకులను నింపేవారు. నెల రోజుల నుంచి నీటి సరఫరా నిలిపేశారు. రూ.కోట్లు వెచ్చించి ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించారు. కానీ తాగునీటి సౌకర్యం కల్పించలేదు.

- గుంతకల్లు టౌన్



వృథాగా ఉన్న తాగునీటి ట్యాంకు

మహిళలే ఎక్కువ..!

జిల్లా ఓటర్లు 20,20,243

పురుషులు 9,99,835
మహిళలు10,20,162
ఇతరులు 246

అనంతపురం టౌన్, మే 2: జిల్లా ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసింది. మార్చి నెలలో విడుదల చేసిన ఓటర్ల సంఖ్య 20,01,200 కాగా.. తాజాగా 19,043 మంది ఓటర్లు పెరిగి.. మొత్తం ఓటర్ల సంఖ్య 20,20,243కు చేరింది. ఇందులో పురుషులు 9,99,835 మంది, మహిళలు 10,20,162 మంది, ఇతరులు 246 మంది ఉన్నారు. తాజా జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళలు 20,327 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం.





నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	1,30858	1,33,518	42	2,64,418
ఉరవకొండ	1,10,772	1,13,774	28	2,24,574
గుంతకల్లు	1,33,347	1,37,635	75	2,71,057
తాడిపత్రి	1,23,714	1,25,363	26	2,49,103
శింగనమల	1,23,351	1,24,423	29	2,47,803
అనంతపురం	1,37,890	1,43,486	27	2,81,403
కళ్యాణదుర్గం	1,14,473	1,16,426	07	2,30,905
రాప్తాడు	1,25,430	1,25,537	12	2,50,979

మోసకారి జగన్‌ను ముస్లింలు నమ్మరు

టీడీపీ, బీజేపీ పొత్తుతోనే ముస్లింల సంక్షేమం

శాసన మండలి మాజీ చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్

గుంతకల్లు, మే 2: తనది మైనార్టీల ప్రభుత్వమని మోసం చేసిన జగన్‌ను ముస్లిం సమాజం ఇక ఎన్నటికీ నమ్మదని శాసన మండలి మాజీ చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ అన్నారు. పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో గురువారం ముస్లిం మైనార్టీల ఆత్మీయ మహా సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ జగన్ హయాంలో రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ముస్లింల 4 శాతం రిజర్వేషన్లు పోతాయని దుష్ప్రచారం చేస్తున్నారని, 2014-19 మధ్య కాలంలో ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉన్నా రిజర్వేషన్లను తొలగించలేదని గుర్తుచేశారు. ముస్లింలు టీడీపీ పక్షాన ఉన్నారని, ఈ ఎన్నికల్లో టీడీపీకి 125 స్థానాలు లభించడం ఖాయమని అన్నారు. మైనార్టీలను మోసం చేసిన జగన్ మోహన్ రెడ్డి.. ఇకపై జగన్ 'మోసం' రెడ్డి అని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ విమర్శించారు. ఎన్నికలకు ముందు జనానికి ముద్దులు పెట్టిన జగన్, అధికారంలోకి రాగానే పేదల నోటికాడి ముద్దని లాగేసుకున్నారని అన్నారు. అన్న క్యాంటీన్‌లను రద్దుచేసి పేదల పొట్ట కొట్టారని అన్నారు. జగన్ పరిపాలనలో అబ్దుల్ సలాం కుటుంబం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందని, మిస్బా అనే విద్యార్థిని వైసీపీ నాయకుడి నిర్వాకం కారణంగా ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. ఈ సంఘటనలపై జగన్ నోరెత్తిన పాపాన పోలేదని అన్నారు. వైసీపీకి బుద్ధి చెప్పడానికి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గుమ్మనూరు జయరాం, అంబికా లక్ష్మీనారాయణకు ముస్లింలు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడు, జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు కేసీ హరి, పవన్‌కుమార్ గౌడు, పత్తి హిమబిందు, డన్‌లప్ బాషా, సలీం, డాక్టర్ ఉమర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షరీఫ్



మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

ఖద్దరంటే ఓ ఠీవీ..!



దర్పం ప్రదర్శిస్తున్న నాయకులు

ఎవరైనా ఖద్దరు డ్రస్ వేసి ఉంటే అతడు రాజకీయ నాయకుడని చెబుతారు. ఎందుకంటే ఆ ఖద్దర్ దుస్తులను గంజిపెట్టి, పాలిష్ చేయడంతో ధరించినవారిని నలుగురిలో ప్రత్యేకంగా నిలుపుతాయి. ఎన్నికల సమయంలో అయితే చిన్నా చితక కార్యకర్తలు సైతం ఖద్దర్‌ని ధరిస్తుంటారు. ప్రస్తుతం ఖద్దర్‌తో పాటు లెనిన్ దుస్తులను రాజకీయ నాయకులు అధికంగా ధరిస్తుంటారు. ఎన్నికల సమయంలో ఖద్దర్ దుస్తులు ధరించి నిగనిగలాడే బూట్లు, వీలైతే చేతికి బంగారు బ్రేస్‌లైట్, ఉంగరాలు, చేతిలో ఖరీదైన ఫోన్, బ్రాండెట్ కళ్లద్దాలతో కనిపిస్తారు. కొందరు నాయకులు కుదిరితే అందరి సమక్షంలో కారులోంచి దిగి దర్పం ప్రదర్శిస్తారు. ఇది అందరు నాయకులకు వర్తించనప్పటికీ కొందరు నాయకులు మాత్రం తగ్గరు. ఎన్నికలు ముగిసేవరకు అద్దెకార్లతో పనులు కానిస్తున్నారు. అయితే ఇవికూడా ఎందుకులే అనుకుంటున్న నాయకులు, కార్యకర్తలు మాత్రం ఖద్దర్ దుస్తులు కుట్టిస్తున్నారు. దీంతో వస్త్ర దుకాణాల్లో ఖద్దర్, లెనిన్ దుస్తుల విక్రయాలు పెరిగాయి. అదే సమయంలో టైలర్లకు కూడా గిరాకీ పెరిగింది. రెడీమెడ్ దుకాణాల్లో కూడా ఈ దుస్తుల విక్రయాలు పెరిగినట్లు పేర్కొంటున్నారు. గ్రామస్థాయి నాయకులు కూడా ప్రచారాలకు వెళ్లేటప్పుడు ఖద్దరు చొక్కాలను వేస్తూ దర్పం ప్రదర్శిస్తున్నారు. **- హిందూపురం**

పేదల నీటికి గండి..!

ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ మూసివేత

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం పంచాయతీ కేంద్రాలలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ పథకం ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలు రెండు రూపాయలకే బిందె నీటిని ఈ ప్లాంట్ల నుంచి తెచ్చుకున్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ వాటర్ ప్లాంట్‌లు మూతపడ్డాయి. మండలం లోని కళ్లహాళ, గోవిందవాడ, ఉప్పరహాళ్ తదితర పంచాయతీలలో సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను మూసివేశారు. ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ ఆధీనంలోకి మినరల్‌వాటర్ ప్లాంటును తీసుకొని ఇతర గ్రామాలకు ఆటోల్లో తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

- బొమ్మనహాళ్



మూతపడిన వాటర్ ప్లాంట్

ఒక్క ఓటు తేడాతో..



కదిరి అర్బన్, మే 2: నా ఒక్క ఓటు వేయకుంటే ఏమవుతుందిలే, అని చాలా మంది అనుకునేవారుంటారు. అయితే ఒక్క ఓటు తేడాతో ఎన్నికల్లో అభ్యర్థులు ఓడిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ముఖ్యమంత్రి పీఠాన్ని కోల్పోయిన నేతలున్నారు. ఒక్కఓటు ఎన్నో ఫలితాలను తారుమారు చేసిన సందర్భాలు అనేకం. సాధారణ ఎన్నికల నుంచి గ్రామ పంచాయతీకి నిర్వహించే ఎన్నికల వరకు అన్ని ఎంతో కీలకమైనవి.

- 2004 కర్ణాటకలోని సంతేమరహళ్లి నియోజకవర్గ నుంచి జేడీఎస్ నుంచి పోటీ చేసిన ఏఆర్ కృష్ణమూర్తి ఒక్క ఓటు తేడాలో ఎమ్మెల్యే సీటు కోల్పోయారు. ఎన్నికల రోజు ఓటు వేయాలనుకున్న తన డ్రైవర్‌కు ఏఆర్ కృష్ణమూర్తి సమయం ఇవ్వకపోవడంతో ఆయన ఓటు వేయలేకపోయినట్లు తరువాత కథనాలు వెలువడ్డాయి.

సీఎం చాన్స్ గల్లంతు

రాజస్థాన్‌లో 2008 శాసనసభ ఎన్నికల్లో నాత్‌ద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున సీపీ జ్యోషి, బీజేపీనుంచి కళ్యాణ్‌సింగ్‌చౌహాన్ పోటీ చేశారు. ఫలితాల్లో ఒక్కఓటు తేడాతో చౌహాన్ గెలుపొందారు. జ్యోషి తల్లి, సోదరి, డ్రైవర్ ఎన్నికల రోజు ఓటు వేయడానికి వెళ్లలేదు. ఈ ముగ్గురు ఓటు వేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎన్నికల్లో జ్యోషి రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగానే కాకుండా సీఎం రేసులో ముందున్నారు. పార్టీని విజయపథంలో నడిపించినా, ఒక్క ఓటుతో ఓడిపోవడంతో సీఎం అయ్యే అవకాశం కోల్పోయారు. వారి మూడు ఓట్లు పడి ఉంటే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయ్యేవారేమో. ఒక్క ఓటు విలువ ఎంతో చెప్పేందుకు ఇవే నిదర్శనం.

జగన్ మామ మోసం..!



విద్యార్థులకు రూ.300 కోట్లు బాకీ

ఉత్తుత్తి బటన్ నొక్కి విడుదల చేసినట్లు ప్రకటనలు

విద్యా, వసతి డబ్బుల కోసం ఎదురుచూపులు

నాలుగేళ్లలో ఇచ్చింది రెండేళ్లకే..

సొంతంగా ఫీజు కట్టుకుంటున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 2 : 'మీ పిల్లలకు మేనమామగా నేనే చదివిస్తా.. ఫీజులు మొత్తం చెల్లిస్తా' అని బాకాలూదిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి.. తన పాలనలో విద్యార్థులకు సుమారు రూ.300 కోట్లు బాకీపడ్డారు. విద్యా, వసతి దీవెన పథకాల పేరుతో ఉత్తుత్తి బటన్లు నొక్కి ఏ ప్రభుత్వం చేయలేని మేలును తానే చేశానంటూ ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం చెల్లించిన ఫీజులను లెక్కలేసి అంతకంటే రెట్టింపు ఇచ్చానంటూ గొప్పలు చెప్పారు. తమ ప్రభుత్వమే విద్యార్థులను ఉచితంగా చదివిస్తూ ఫీజులు చెల్లిస్తుందని నమ్మించారు. వాస్తవానికి తమ కష్టార్జితంతో కళాశాలలకు ఫీజులు కట్టి పిల్లలను చదివిస్తున్నామని, జగన్ సొంతడబ్బా కొట్టుకున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చెల్లించింది రెండేళ్లకు మాత్రమేనని.. అదీ ఆరొకరగా ఇచ్చి చేతులు దులుపుకుందని వాపోతున్నారు. 2023-24లో నొక్కిన బటన్లు ఏమైయ్యాయని.. ఆ డబ్బులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నిస్తున్నారు.

ఉత్తుత్తి బటన్ నొక్కుడు..

జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో కన్వీనర్ కోటా ద్వారా దాదాపు 1.20 లక్షల మంది బీటెక్, 15వేల మంది బీఫార్మసీ, 50వేల మంది డిగ్రీ కోర్సులు అభ్యసిస్తున్నారు. 12వేల మంది పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్నారు. వీరందరూ విద్యాదీవెన, వసతి దీవెన పథకాల అర్హులు. బీటెక్, బీఫార్మసీ నాలుగు సంవత్సరాలు. డిగ్రీ, పాలిటెక్నిక్ కోర్సులు మూడేళ్ల చొప్పున చదవాలి. ప్రతి ఏటా ఫీజులు మొత్తాల చెల్లింపు పూర్తిచేస్తేగాని కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు రాయనీయవు. జగన్ మాత్రం సంవత్సరంలో నాలుగుసార్లు ఉత్తుత్తి బటన్ నొక్కుతున్నారని మండిపడుతున్నారు.

ఫీజు మొత్తాల్లోనూ వివక్ష..

గత టీడీపీ ప్రభుత్వం విద్యార్థులు చదువుతున్న కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించేది. విద్యార్థుల వివరాలను జోడించి వారి పేరుతో కళాశాల ఖాతాలకు జమచేసేది. బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ, పాలిటెక్నిక్.. ఇలా కోర్సులను బట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాన్ని కళాశాలలకు జమచేసేది. కళాశాలలపై కక్షకట్టిన జగన్.. ఒక్కో కళాశాలకు ఒక్కోవిధంగా ఫీజులు నిర్ణయించారు. బీటెక్‌లో.. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు రూ.43వేల నుంచి రూ.77వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్, కాన్‌స్టిట్యూయెంట్ కళాశాలలకు రూ.10వేల నుంచి రూ.37వేల వరకు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు, ప్రైవేట్ యూనివర్సిటీలకు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు కన్వీనర్ కోటాకింద ఫీజులను నిర్ణయించారు. బీఫార్మసీలో.. ప్రైవేట్ కళాశాలలకు రూ.38వేల నుంచి రూ.65వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలకు రూ.10వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.35వేల నుంచి రూ.50వేలుగా చేశారు. డిగ్రీ కోర్సుల్లో.. ఆర్ట్స్‌కు రూ.4,175నుంచి రూ.11వేల వరకు, సైన్స్‌కు రూ.4,875నుంచి రూ.16వేల వరకు నిర్ణయించారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో.. ప్రభుత్వ కళాశాలకు రూ.4,700, ప్రైవేట్ కళాశాలలకు రూ.25వేలుగా నిర్ణయించారు.

కన్వీనర్ కోటాలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను విద్యా దీవెన, వసతి

రూ. 300 కోట్ల ఎగనామం

దీవెన కింద దాదాపు రూ.300కోట్లు ఎగనామం పెట్టారని విద్యార్థులు, అధికార వర్గాలు మండిపడుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఒక్కపైసా చెల్లించలేదని వాపోతున్నారు. తాజాగా నొక్కిన బటన్ ద్వారా ఏ విద్యార్థి తల్లి ఖాతాలో కూడా నగదు జమకాలేదని మండిపడుతున్నారు. హాస్టల్‌లో వసతి పొందేందుకు సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీనిచ్చి రూ.10వేలకు కుదించారని వాపోతున్నారు. అందులోనూ నాలుగేళ్లకు రెండు సంవత్సరాలు ఎగ్గొట్టారని చెబుతున్నారు. జగన్ తన సామాజికిక వర్గానికి చెందిన కళాశాలలకు ఫీజులు అధికంగా పెంచి ఆ భారాన్ని తమ మోపాడని మండిపడుతున్నారు. రాజకీయ పలుకుడి లేని కళాశాలల్లో బీటెక్ ఫీజు రూ.45వేలు అయితే ఆయన వర్గానికి చెందిన కళాశాలల్లో రూ.77వేలు నిర్ణయించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- వేమన, ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు

అబద్ధపు మాటలతో పేదలను నమ్మించి మోసం చేయ

మోసానికి మారుపేరు జగన్

డం లో జగన్‌కు తిరుగులేదు. జేఎన్‌టీయూ, ఎస్కేయూలో పరిధిలో కన్వీనర్ కోటాకింద దాదాపు రెండు లక్షల మందికి విద్యాదీవెన, వసతి దీవెన డబ్బులు మంజూరు చేయాలి. నాలుగేళ్లలో రూ.300 కోట్లకు పైగా జగన్ బాకీపడ్డారు. వసతి దీవెన కింద ఏడాదికి రూ.20వేలు ప్రకటించి రూ.10వేలకు కుదించారు. అదికూడా ఇవ్వకుండా మోసం చేశారు.



సంవత్సరంలో నాలుగుసార్లు బటన్

కుళ్లాయిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఏడాదికి ఒకసారి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సీఎం జగన్‌రెడ్డి నాలుగుసార్లు బటన్ నొక్కుతున్నాడు. డిగ్రీకి రూ.4వేలు, ఇంజనీరింగ్‌కు రూ.10వేలు ఇలా చిన్నచిన్న మొత్తాలను నాలుగుసార్లు విడుదల చేయడంతో వచ్చే వెయ్యి, రెండువేలు ఖర్చులకే సరిపోతుంది. కళాశాలలకు ఎప్పుడు కట్టాలి. నాలుగేళ్లలో రెండు సంవత్సరాలు మాత్రమే ఫీజులు చెల్లించి మిగిలిన డబ్బులు బాకీపడ్డారు. రూ.20వేల నుంచి రూ.70వేలు ఫీజులున్న కళాశాలలకు పేద విద్యార్థులు ఎలా చెల్లిస్తారు?. జగన్ ఇంటికి పోయే సమయం దగ్గరపడటంతో చేతులెత్తేశాడు.

పనికెళ్లి ఫీజులు కడుతున్నా...

విద్యా దీవెన డబ్బులు రాకపోవడంతో ఊర్లో కూలిపనుకెళ్లి కళాశాల ఫీజులు కడుతున్నాను. చదువులు ఉచితమని ప్రభుత్వం చెబుతున్నా ఫీజులు ఇవ్వడంలేదు. సంవత్సరంలో రెండు సెమిస్టర్ పరీక్షలు రాయాలి. ఫీజులు కట్టకుంటే పరీక్షలు రాయనీయరు. వసతి దీవెన రూ.10వేలు కూడా రాలేదు. నాలాంటి చాలామంది పేద విద్యార్థులు డిగ్రీ చదువుతున్నా సెలవు రోజుల్లో కూలి పనులకెళ్లి ఫీజులు కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్పందించి ఫీజు మొత్తాలను విడుదలచేయాలి.

- జయలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని



విద్యా, వసతి దీవెనలు అందలేదు



ప్రభుత్వం చెల్లిస్తామన్న విద్యా, వసతి దీవెన డబ్బులు అందలేదు. సీఎం జగన్.. బటన్ నొక్కుతూనే తల్లుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పినా నేటికీ రాలేదు. దీంతో అమ్మ, నాన్న కూలి పనుకెళ్లి వచ్చిన డబ్బులతో ఫీజులు కడుతున్నాం. డిగ్రీ పూర్తిచేసి బీఈడీ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తే టీచర్ పోస్టు సంపాదించవచ్చు. డిగ్రీ చదవాలంటేనే ప్రభుత్వం ఫీజులు ఇవ్వడంలేదు. ఇలాగైతే బీఈడీ ఎప్పుడు పూర్తిచేయాలి. టీచర్ పోస్టు ఎలా సాధించాలి.

-సొఫియా, డిగ్రీ విద్యార్థిని



మెళవాయిలో పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం

ఏళ్లు గడిచినా... అంతేనా ?

నేటికీ పూర్తికాని సచివాలయ భవన నిర్మాణాలు



ఆమిదాలగొందిలో ఆగిపోయిన భవన నిర్మాణం

మండలంలో 18 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇంకా కొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాల కోసం రూ.8.10 కోట్లతో పనులు చేపట్టారు. ఒక్కో సచివాలయ భవనానికి రూ.45 లక్షలు విడుదల చేశారు. మొదటి విడతలో నిధులు బాగా విడుదల కావడంతో పనులు ఎంతో ఉత్సహంగా చేపట్టారు. రెండో విడుతకు నిధులు విడుదల కాకపోవడంతో చాల భవనాలు లింటిల్, టాప్‌లెవల్ వరకు వచ్చి నిలిచిపోయాయి. మెళవాయి గ్రామ సచివాలయం పునాదులకై పరిమితమైంది. నిధుల కొరతతో ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. అందుకే సచివాలయాల నిర్వహణ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు, మహిళా సంఘాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు.

- మడకశిర రూరల్

కేతిరెడ్డి సారు చెప్పారు.. ప్రచారానికి రండి..!

సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు వైసీపీ కౌన్సిలర్ హుకుం

ధర్మవరం, మే 2: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా ప్రచారానికి రావాలని అధికార పార్టీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ ఆదేశించిన వాయిస్ మెసేజ్ వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తోంది. 'ఎమ్మెల్యే కేతిరెడ్డి సార్ చెప్పారు.. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎన్నికల ప్రచారానికి ఉదయం 6గంటలకంత లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న మన కాంప్లెక్స్ వద్దకు రావాలి..' అని వాట్సాప్ ద్వారా పంపిన మెసేజ్ అన్ని గ్రూపుల్లో వైరల్‌గా మారింది.

ఊరుకిచ్చిన మాట గుర్తుందా..?

అనంతపురం రూరల్

అప్పుడెప్పుడో ఎన్నికల ప్రచారానికి మా ఊరికొచ్చావ్. ఎన్నో హామీలిచ్చావ్. గెలిస్తే గ్రామానికి వచ్చి వెళ్లే ప్రధాన రోడ్డు వేస్తానన్నావ్. గ్రామానికి రోడ్లు, కాలువలు, నీళ్లు ఇస్తానన్నావ్. నిజంగా పనులన్నీ చేస్తావేమోనని మేమంతా సంబరపడ్డాం. పోలింగ్ రోజు ఎగబడి ఓట్లు వేశాం. గెలిచావ్. ఆనక కనిపించకుండా పోయావ్. ఎమ్మెల్యేగారు..! అసలు మా ఊరంటూ ఒకటి ఉందని గుర్తుందా? అని ఆ ఊరి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదెక్కడి పాలనో? ఈయనేమీ పాలకుడో అంటూ ఈసడించుకుంటున్నారు. ఇదీ రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం, ఆలమూరు పంచాయతీ పరిధిలోని ఎం.బీ.పల్లి గ్రామస్థుల ఆవేదన. గ్రామం ఏమైనా మారుమూల ప్రాంతంలో ఉందా అంటే అదీ కాదు. అనంతపురం-ఆలమూరు రోడ్డు నుంచి గ్రామానికి 4.5కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. టీడీపీ హయాంలో దాదాపు రూ.1.9కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రోడ్డు వేసేందుకు మట్టి పనులు పూర్తి అయ్యాయి. ఊళ్లో నుంచి అర్ధబాగం చిన్న సైజు కంకర కూడా వేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పాలకులు రోడ్డు సమస్యతో పాటు గ్రామంలోని సమస్యలు అలానే వదిలేశారు. ఐదేళ్ల కాలంలో పాల కులు గ్రామానికి వెళ్లింది కానీ స్థానిక సమస్యలు చర్చించి..వాటి పరిష్కారానికి ఒక్క పైసా ఖర్చు చేసిన దాఖలు లేవని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. ఏడాది కిందట కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్డు గుంతలు జలమయమైపోయాయి. దీంతో గ్రామస్థులే గుంతలు పూడ్చుకున్నారు. అయినా రోడ్డు నిర్మాణం జరగలేదు. స్థానిక ప్రజాప్రతినిధి తరచూ తన సొంత గ్రామానికి ఆలమూరు ప్రధాన రోడ్డుపైనే ప్రయాణం సాగిస్తున్నారు. అప్పుడైనా మా గ్రామానికి ఇచ్చిన మాటలు ఆయనకు గుర్తుకురాకపోవడం తాము చేసుకున్న పాపమని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు మరచిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎంబీపల్లికి ఐదేళ్లలో పైసా ఖర్చుచేయని దుస్థితి



కంకరతేలిన ఎంబీ పల్లి రోడ్డు

అయినా అభివృద్ధిని మాత్రం పాలకులు విస్మరించారు. గ్రామంలో ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదంటే అభివృద్ధి ఏమేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మండలంలోని సమస్యలే ఇలా పరిష్కరిస్తున్నారంటే ఇక దూరంగా ఉన్న ప్రాంతాల్లోనే సమస్యలు ఎలా రూపుమాపుతున్నారో ఆ పాలకులకే తెలియాలి.

సమస్యలు పట్టించుకునేదెవరు ?

గ్రామంలో ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీలున్నాయి. దాదాపు 80 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామం చిన్నదే అయినా సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం ప్రధాన సమస్య.



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు కాలువ

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చూసిందే లేదు. అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే జరిగింది. అప్పట్లో కొంత వరకు సీసీరోడ్ల నిర్మాణం జరిగింది. గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు కూడా ప్రారంభమైంది. అయి తే ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



- వీరాంజనేయులు, ఎంబీపల్లి

ఇబ్బందుల ప్రయాణం

గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలు పడింది. కంకర తేలింది. దీంతో ఆలమూరు రోడ్డు-అనంతపురం ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి ప్రయాణం చేయాలంటే అరగంట పడుతోంది. పాలకులు వచ్చి హామీలు ఇవ్వడమే తప్పా- రోడ్డు నిర్మాణం చేసింది లేదు. మా సమస్య తీరింది లేదు.



- బాలకృష్ణ, ఎంబీపల్లి

అలా ఇచ్చి... ఇలా దోపిడీ

ధర్మవరం

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో ఆటోవాలాలకు ఆర్థిక కష్టాలు తప్పడంలేదు. ఏదో ఆదుకుంటాడనుకుంటే ఉన్నది లాగేసుకుంటున్నాడని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గోరంత సాయం చేసి కొండంత లాక్కోవడంపై ఆటో వర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి ఆటో కార్మికులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసినట్టు చేసి అంతే స్థాయిలో వారి నుంచి వివిధ రూపాల కింద రెట్టింపు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లాలో 30వేలకు పైగా ఆటోలు ఉండగా అందులో నగం మందికి కూడా ఆర్థిక సాయం అందడం లేదు. జరిమానాలు, రోడ్డు టాక్స్, సీఎన్‌జీ రూపంలో వసూలు చేస్తూ ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.130 జరిమానా విధిస్తే జగన్‌రెడ్డి రూ.1030 జరిమానా పెంచడంపై మండిపడుతున్నారు. ఏడాదిలో 10-15 సార్లు పని కట్టుకుని జరిమానాలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. అదే విధంగా రోడ్డు టాక్స్, సీఎన్‌జీ వంటి టాక్స్‌లు కూడా భారీగా పెంచడంపై ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్మంతా జరిమానాలకే సరిపోతోందని, ఇక తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వాపోతున్నారు. జగన్ సర్కారుకు తగిన సమయంలో తగిన మూల్యం చెల్లిస్తామని ఆటో కార్మికులు బాహాటంగా చెబుతున్నారు.



ఆటో డ్రైవర్లకు ఆర్థిక కష్టాలు

వాహన మిత్రతో ఒరిగింది శూన్యం

ఏటా ఇచ్చేది రూ.10వేలు

జరిమానాలు, సీఎన్‌జీ, పన్నుల పేరుతో రెట్టింపు వసూలు

జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక జరిమానాలు భారీగా పెరిగాయి. టీడీపీ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.130 జరిమాన విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ట ధర రూ.1030 అయింది. ఏకంగా పది రెట్లు పెరిగిందన్నమాట. ఏడాదికి 10 నుంచి 15 వరకూ జరిమానాలు విధిస్తున్నారు. ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో దాదాపు రూ.10వేల వరకు లాగేస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

పన్నులు, పర్మిట్లతో గుంజుడే గుంజుడు

ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలాలు మొత్తుకున్నా వినలేదు. పన్నును అమాంతంగా పెంచేశారు. పదిహేనేళ్ల కాల పరిమితి దాటిన వాహనాలకు విధించే ఈ పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలాలు కోరినా వినలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది జగన్ ప్రభుత్వం. ఇలా సగటున ఒక్కో ఆటోవాలాకు ఏడాదికి రూ.10వేలకు పైగానే అదనపు భారం పడుతోంది.

సీఎన్‌జీ బాదుడు మరోలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర రూ.55గా ఉంది. ప్రస్తుతం రూ.85కు చేరింది. ఏటా రూ.5,రూ.10,రూ.15 మేర పెరుగుతూ వస్తోంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనుకేసుకుందాం అనుకునే ఆటోవాలాలకు భారంగానే మారింది. రోజూ సగటున 200 నుంచి 250కిలోమీటర్ల వరకు నడుపుతారు. ఇందుకు 6 కిలోల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ.30తో రోజుకు రూ.180 చొప్పున నెలకు రూ.5400 అదనపు భారం పడుతోంది. ఏడాదికి రూ.64,800 భారమవుతోంది. సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తోంది. ఈ ప్రకారం ఒక్కో ఆటో వాలా నుంచి ఏడాదికి రూ.2160 అదనంగా తీసుకుంటోంది.

ఆటోలను అమ్ముకోవాల్సిందే

గత టీడీపీ హయాంలో జరిమానాలు తక్కువగా ఉండేవి. రోజంతా కష్టపడితే కనీసం రూ.500 మిగిలేది. నాకు రెండు ఆటోలుండేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు, ఇతర పన్నులు పెరగడం వల్ల ఒక ఆటో అమ్మేశాను. పైగా రోజంతా ఆటో నడిపితే ఏమాత్రం మిగిలలేని పరిస్థితి.



రాజేశ్, ఒలిమిచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదు

ఆటో డ్రైవర్లకు వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీలేదు. వాహన మిత్ర కింద రూ.10వేలు ఏడాదికి ఇస్తున్నమాట వాస్తవమే. ఆ రూ.10వేలు జరిమానాల రూపంలో లాగేసుకుంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు తనిఖీలు చేయడం జరిమానాలు విధిస్తున్నారు. కుటుంబ పోషణ భారమైంది.



- రవి, కోడేకండ్ల, బత్తలపల్లి మండలం

ఏమి చేశారని ఓటడుగుతున్నారు..?



వైసీపీ నాయకులను ప్రశ్నిస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఐదేళ్ల పాలనలో మా కాలనీకి ఏమి చేశారని ఓటడుగుతున్నారని బెళుగుప్ప ఎస్సీ కాలనీవాసులు గురువారం వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కాలనీలో డ్రైనేజీ అధ్వానంగా ఉంది. రోడ్లపైనే మురుగు నీరు పారుతోందన్నారు. ఒక్క ఇంటి పట్టా ఇచ్చారా అని నిలదీశారు. కాలనీలో వైసీపీ నాయకులు గడపగడపకు సంక్షేమం ప్రచారం నిర్వహిస్తుండగా కాలనీవాసులు తిప్పేస్వామి, భైనే నారాయణ స్వామి, శ్రీరాములు, సూరీ, రాజేష్, లోకేష్, అనిల్ తదితరులు నాయకులతో సమస్యలు తెలిపారు. మురుగు నీటి దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నామని తెలపగా వారిపై వైసీపీ నాయకులు మండిపడ్డారు.

\- బెళుగుప్ప

ఆగిన అమూల్ డెయిరీలు



గాండ్లపెంటలో అర్ధంతరంగా ఆగిన అమూల్ పాల డెయిరీ నిర్మాణాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల డెయిరీలు నిర్మిస్తామని ఎంతో గొప్పగా చెప్పినా, నిధులు కొరతతో మండల వ్యాప్తంగా పలు దశాల్లో అమూల్ పాల డెయిరీల నిర్మాణాలు నిలిచిపోయాయి. మండలంలో పాల డెయిరీలు 19 నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. ఈడెయిరీల ద్వారా పాడిరైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని చెప్పారు. రెండేళ్ల కిందట పునాదులు వేసి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. ఒక్కొక్క డెయిరీ నిర్మాణానికి రూ.15లక్షలకు పైగా నిధులు అంచనా వేశారు. అయితే ఈమొత్తం సరిపోకపోవడంతో పలు డెయిరీల నిర్మాణాలు నిలిచిపోయాయి. మరికొంత పెంచుతామని అధికారులు చెప్పినా ఆయా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. దీనిపై వివరణ కోరడానికి పీఆర్ జేఈ రెడ్డిప్రసాద్‌ను ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

\- గాండ్లపెంట

వలంటీర్.. ఆన్ ఎలెక్షన్ డ్యూటీ..



కోటూరులో ఓటరు స్లిప్పులు సరిచూస్తున్న వలంటీర్

తనకల్లు మండలం కోటూరులో వలంటీర్‌గా పని చేస్తున్న శ్రీలత గురువారం బీఎల్‌ఓలతో కలిసి ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. గ్రామంలోని ఓ ఇంటిలో కూర్చొని ఓటరు స్లిపులను, జాబితాతో సరిచూసి పంపిణీలో పాల్గొన్నారు. ఈవిషయంపై బీఎల్ఓ నాగరాణిని విలేకరులు ప్రశ్నించగా వలంటీర్ వారి ఇంటిలోని ఓటరు స్లిప్పులను సరిచూసుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. కోటూరులోని ఓ ఇంటిలో ఓటరు స్లిపులు సరిచూస్తున్న విషయాన్ని గ్రామానికి చెందిన ఓవ్యక్తి వీడియో తీసి, సోషల్ మీడియాలో పెట్టారు. ఈవిషయం పెద్ద చర్చనీయాంశమైంది.

\- తనకల్లు



తాడిపత్రిలో కిటకిట..

నీకిది తగునా.. మనవడా..?

- పింఛన్ లబ్ధిదారుల ఆక్రందన
- డబ్బు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు
- కొన్ని చోట్ల పాత అప్పులకు పింఛన్ సొమ్ము జమ
- ఖాతాకు ఆధార్ లింక్ లేదని వెనక్కి పంపుతున్న సిబ్బంది
- మండే ఎండలకు అల్లాడిపోతున్న లబ్ధిదారులు



అనంతపురంలోని సాయినగర్ మెయిన్ బ్రాంచ్‌లో పింఛన్ కోసం వచ్చిన ఓ వృద్ధుడు

వైసీపీ ప్రభుత్వ తీరుతో రెండో నెల కూడా సామాజిక పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. పింఛన్ డబ్బులను ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో అవ్వాతాతాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. పింఛను డబ్బు కోసం వృద్ధులు బ్యాంక్‌లు, గ్రామ సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఇన్నాళ్లు ఇంటి వద్దే పింఛన్ తీసుకున్న తమకు ఎన్నికల సాకుతో ప్రభుత్వం కొత్త చిక్కులు తెచ్చిపెట్టిందని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే ఎండలు దంచికొడుతున్నాయి. ఈక్రమంలో నగదు కోసం వెళ్లిన వృద్ధులు అల్లాడిపోతున్నారు. కొందరి ఖాతాల నుంచి లావాదేవీలు జరగకపోవడంతో వాటిని బ్లాక్ చేశారు. వాటిని రీ ఓపెన్ చేయాలంటే ఆధార్‌కార్డు, సెల్ నంబర్‌తో అప్‌డేట్ చేయించుకోవాలని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. అయితే చాలా ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోవడం వలన బ్యాంక్ మినీ సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఆధార్ అప్‌డేట్ కోసం రెండు రోజుల పాటు తిరిగాలి. ప్రతి రోజు బ్యాంక్ వద్దకు వస్తే... కనీసం రూ.300 నుంచి 500 వరుకు ఖర్చువుతోందని వృద్ధులు వాపోతున్నారు. బ్యాంక్‌ల వద్ద విత్ డ్రా ఫారాలు రాసేందుకు వెలుగు సిబ్బంది లేదా, గ్రామ సచివాలయాల సిబ్బంది కూడా కనిపించలేదు. దీంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద బ్యాంక్ విత్‌డ్రా ఫారాలు, ఆధార్‌అప్‌డేట్ ఫారాలు రాసినందుకు రూ.30 నుంచి రూ.40 ఖర్చు అవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈక్రమంలోనే ఎన్ని తిప్పలు తిప్పలు తెచ్చిపెట్టావురా జగనా అంటూ వృద్ధులు శాపనార్థాలు పెడుతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



తాడిపత్రిలో బ్యాంకు వద్ద లబ్ధిదారుల రద్దీ



పామిడిలోని యూనియన్ బ్యాంకు వద్ద..



కూడేరులో ఎండలో పింఛన్‌దారుల అగచాట్లు



బుక్కరాయసముద్రంలో ఆధార్ అప్‌డేట్ కోసం..



అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు ఎస్‌బీఐలో లబ్ధిదారులు

బువ్వ తినకుండా వచ్చా



ఎప్పుడూ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చే వారు. ఎలచ్చన్ వచ్చిందని పింఛన్ సొమ్ము బ్యాంకులో వేశామని చెప్పారు. బువ్వకూడా తినకుండా బ్యాంకుకు వచ్చా. ఇక్కడేమో చానామంది ఉన్నారు. ఒక పక్క ఎండ, ఇంగోపక్క కడుపులో మంట. ఇంటికిపోలేను ఈడ ఉండలేను. పింఛన్ తీసుకునేటప్పటికి పానం పోయినట్లయ్యింది.

\- వడ్డేనరసమ్మ, ఎనుమలపల్లి, పుట్టపర్తి

పదకొండునూర్లు పట్టుకున్నారు..



నెలనెలా మూడువేలు పింఛన్ ఇచ్చేవారు. ఈనెల పంతొమ్మిదినూర్లు చేతికొచ్చింది. ఏంటికి తక్కువ లెక్క ఇచ్చారని అడిగితే బ్యాంకు బుక్కులో దుడ్లు లేవని సారోళ్లు చెప్పారు. ఏంటివో సేవా చార్జీల కింద కట్ అయ్యాయంట. ఎప్పుడో వెయ్యికట్టి బ్యాంకు బుక్కు తీసుకున్నా అవి ఏమయ్యాయో తెలీదు. పింఛన్ లెక్కలో పదకొండునూర్లు పట్టుకుని ఇచ్చారు. బ్యాంకులో వేయకుండా సేతికిచ్చింటే బాగుండు. బ్యాంకుకు పోయి వచ్చేకి సాలైపాయా.

\- పెద్దతిరుపాలు కర్ణాటక నాగేపల్లి, పుట్టపర్తి



పక్షవాతంతో బాధపడుతున్న మల్లయ్యను బ్యాంకుకు తీసుకెళుతున్న భార్య అంజినమ్మ

ఎందుకు ఇవ్వరో చెప్పరు



పొద్దున్నుంచి ఈడే ఉన్నా. వేలు పెట్టి పింఛన్ డబ్బులు తీసుకుందామంటే రావన్నారు. బ్యాంకులో తీసుకోమని చెప్పారు. బ్యాంకులో అడిగితే వాళ్లు రావంటున్నారు. ఎందుకు రావో? ఎందుకు ఇవ్వరో సరిగ్గా చెప్పరు. నాలాంటి వాళ్లు చాలా మంది దుడ్లు రాక ఇబ్బంది పడుతున్నారు. సమస్య ఏమిటో ఎవరూ అర్థమయ్యేలా చెప్పడం లేదు.

\- పెద్ద ఎల్లప్ప, వంకరాజుకాలువ

ఇంటి వద్దే ఇవ్వాలి..

మా ఊరిలో బ్యాంకు లేదు. బ్యాంకు పని ఉందంటే బెళుగుప్పకు రావాల్సిందే. రాను పోను రూ. 80లు చార్జీ అవుతుంది. ఇంత కష్టపడి వస్తే పింఛన్ అకౌంట్‌లోకి జమ కాలేదంటున్నారు. ఎండలకు అల్లాడిపోతున్నాం. మళ్లీ రేపు రావాలంటే చానా ఇబ్బంది పడాల్సిందే. ఖర్చులకే దాదాపు రూ. 200లు పోతుంది. అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



చౌడక్క, లబ్ధిదారురాలు, శ్రీరంగాపురం, బెళుగుప్ప మండలం

నాలుగు బ్యాంకులు తిరిగా

పింఛన్ సొమ్ముపై ఆధారపడి బతుకుతున్నా. నలుగురు కొడుకులు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్ సొమ్ముతోనే భత్యం తెచ్చుకుని సొంతంగా వండుకుని తింటున్నాను. పోయిన నెలలో ఇచ్చిన పింఛన్‌తో బియ్యం, ఇతర వస్తువులు తెచ్చుకున్నా. అంతా అయిపోయింది. ఈ నెలకు అవసరమైన భత్యం తెచ్చుకోవాలంటే పింఛన్ ఇంకా రాలేదు. ఇప్పటికే ఎండలో నాలుగు బ్యాంకుల చుట్టూ తిరిగా. ఇంకా పడలేదని చెబుతున్నారు. ఎండలో నడవలేక నానా అవస్థలు పడ్డా. ఆటోకి రూ.500 ఖర్చు అయిపోయింది. అయినా ఇంకా పింఛన్ అందలేదు.



\- నూర్జహాన్, అనంతపురం

ఆధార్ లింక్ కాలేదని తిప్పుతున్నారు..



పింఛన్ కోసం పొద్దున్నే వచ్చా. బ్యాంక్‌లో లైన్‌లో నిలబడి డబ్బు తీసుకునేందుకు పోతే అకౌంట్‌కు ఆధార్ లింక్ కాలేదని వెనక్కి పంపించారు. ఆధార్ లింక్ ఎక్కడ చేయించుకోవాలో తెలియక ఎండలో రెండు, మూడు సార్లు తిరిగా. లింక్ చేయించుకునేందుకు, అప్లికేషన్ ఫారమ్ రాపిచ్చుకునేందుకు రూ.100 ఖర్చు అయ్యింది. ఆటో, టిఫెన్, భోజనాలకు మొత్తం ఈ రోజే రూ.400 ఖర్చు అయ్యింది. సీఎం జగన్ చాలా పొరపాటు చేస్తున్నాడు. కనీసం గ్రామ సచివాలయాల వద్ద అన్న పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకుని ఉంటే బాగుండేది.

\- బయన్న, కేకే అగ్రహారం

ఎవరికీ ఈ కష్టాలు రాకూడదు



ఈ ముసలి వయస్సులో పగవాడికి కూడా ఇన్ని కష్టాలు రాకూడదు. 75 సంవత్సరాల వయస్సులో 18 కిలోమీటర్లు దూరం నుంచి వచ్చి పింఛన్ డబ్బు తీసుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. ఇక్కడికి వచ్చినాక బ్యాంక్ సిబ్బంది అకౌంట్ అప్‌డేట్‌లో లేదు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఇస్తే.. తిరిగి అప్‌డేట్ చేసేందుకు బ్యాంక్‌లోనే 2 గంటల సమయం పట్టింది. ముసలి వాళ్లను ఎన్ని కష్టాలు పెడుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి తప్పుడు నిర్ణయాలు ఇకమీదటనైనా తీసుకోకుండా ఉండాలి.

\- ఎర్రిస్వామి, వెంకటాపురం

ఎలా బతకాలి..?



నాకు ప్రతి నెలా వచ్చే రూ. మూడు వేల వింతంతు పింఛనే మా కుటుంబానికి ఆధారం. ఈ నెల పింఛన్‌ను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అయితే అప్పు ఉందని బ్యాంకు అధికారులు దాన్ని పట్టుకున్నారు. ఇప్పుడు ముగ్గురు పిల్లలతో నేనెలా బతకాలి?

\- లక్ష్మీదేవి, వితంతువు, సీకేపల్లి

ప్రభుత్వానికి శాపనార్థాలు

రొద్దం మండలంలోని అనేక గ్రామాల్లోని వృద్ధులు, వితంతువులకు పింఛన్ బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. గురువారం మోపర్లపల్లి, తాడంగిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు 15కి.మీ.దూరం లోని రొద్దం కెనరాబ్యాంక్‌కు అష్టకష్టాలు పడి చేరుకున్నారు. మోపర్లపల్లి గ్రామానికి చెందిన 72ఏళ్ల వృద్ధుడు మల్లయ్య పక్షవాతంతో బాధపడుతూ నడవడానికి చేతగాని పరిస్థితుల్లో భార్య అంజినమ్మ సాయంతో బ్యాంకు వద్దకు వచ్చాడు. ఆయన పరిస్థితిని చూసిన అక్కడి జనం వైసీపీ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడిందని శాపర్థాలు పెట్టారు. కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన 80ఏళ్ల వృద్ధురాలు నాగమ్మ పింఛన్ కోసం అనంతగ్రామీణ బ్యాంక్‌కు రాగా పెన్షన్ పడలేదని చెప్పడంతో ఎండలో నడవలేక బస్టాండులోని షాపువద్ద మెట్లపై కూర్చుండిపోయింది. ఇలా ఒక్కొక్కరి బాధలు ఒక్కో రకంగా ఉన్నాయి.

చంద్రబాబుపై విషప్రచారం

శింగనమల మండలంలో వైసీపీ నాయకులు సరి కొత్త విష ప్రచారానికి తెర తీశారు. సామాజిక పింఛన్లు తీసుకోవడానికి బ్యాంకుల వద్దకు వచ్చిన లబ్ధిదారులతో చంద్రబాబు వల్లే మీకు ఈ కష్టాలు వచ్చాయని దుష్ప్రచారం చేస్తున్నారు.

డబ్బును జమ చేసుకున్నారు



నాలుగేళ్ల కిందటే భూమి అమ్మేశా. అప్పుడే క్రాప్‌లోన్ మొత్తం కట్టేశా. అయినా ఇప్పుడు బకాయి ఉందని పింఛన్ డబ్బులు పట్టుకున్నారు. పింఛన్‌తోనే బతుకుతున్న నాకు ఇప్పుడు దారేదీ?

\- అంకమ్మ, పెరవలి

దుష్ప్రచారం బాధాకరం



బ్యాంకులో నేను రూ.1.5 లక్షల రుణం తీసుకున్నా. రెండేళ్లుగా రెన్యువల్ చేయలేదు. ఈనెల పింఛన్ రూ.3వేలు ఖాతాలో జమ కాగానే బ్యాంకు అధికారులు పాత బకాయిలోకి జమ చేశారు. అయితే కొందరు వైసీపీ నాయకులు బ్యాంకు వద్దకు వచ్చి చంద్రబాబునాయుడు వల్లే ఇలా జరుగుతోందని దుష్ప్రచారం చేయడం బాధాకరం.

\- ఓబిలేసు చిన్నజలాలపురం



కొత్తచెరువు ఏపీజీబీ వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

బ్యాంకులు కిటకిట

తమ ఖాతాల్లో జమ అయిన పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావడంతో గురువారం యాడికిలోని బ్యాంక్‌లు కిటకిటలాడాయి. పలువురు వృద్ధుల బ్యాంక్ ఖాతాలకు లాక్‌పడటంతో కొద్ది మంది పెన్షన్ లబ్ధిదారులు సొమ్మును తీసుకోలేకపోయారు. దీంతో బ్యాంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కొంతమంది వృద్ధులు తమ పింఛన్ ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయిందో తెలుసుకోవడానికి సచివాలయం వద్ద నిరీక్షించారు. మరికొందరు డబ్బు తీసుకోవడానికి బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఆశ్రయించారు. ఇదే అదనుగా కస్టమర్ సర్వీస్ పాయింట్ల వారు లబ్ధిదారుల నుంచి రూ.30 వసూలు చేశారు.



పింఛన్ జమకాకపోవడంతో రొద్దం బస్టాండు మెట్లపై కూర్చున్న వృద్ధులు



ఉరవకొండలో పింఛన్ కోసం వస్తున్న వృద్ధులు



అనంతపురం: నిలబడలేక..



అనంతపురంలోని సాయినగర్ ఎస్‌బీఐలో క్యూలో, కుర్చీల్లో ఉన్న పింఛన్ లబ్ధిదారులు

నీడ కూడా కరువే..

పింఛన్ సొమ్ము తీసుకోవడానికి బ్యాంకుకు వచ్చే లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను కొత్తచెరువు ఏపీజీబీ సిబ్బంది బేఖాతరు చేశారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉన్నతాధికారులు సైతం బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు, ప్రజలకు తాగునీటి సౌకర్యంతోపాటు నీడ కోసం షామియానాలు సైతం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీజీబీ మేనేజర్ ఆ సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో పింఛన్ డబ్బులు కోసం వచ్చిన వృద్ధులు నానా అగచాట్లుపడ్డారు. యూనియన్ బ్యాంక్ వద్ద నీడతోపాటు కుర్చీలు, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లబ్ధిదారులు ఆ బ్యాంకు వద్ద చేసిన ఏర్పాట్లు మీరు చేయరా అంటూ ఏపీజీబీ మేనేజర్‌ను ప్రశ్నించడంతో రెండు గంటల తర్వాత షామియానాను తెచ్చి నీడ కల్పించారు.

ఓటమి భయంతో అనంత వణుకు

- ఇంత వయసొచ్చినా.. చీప్ ట్రిక్స్ మానలేదు
- ఎక్కడో జరిగిన ఘటనను నాకు ఆపాదిస్తారా..?
- రాసుకో అనంతా.. నిన్ను ఓడించబోతున్నా..
- కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, మే 2 : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఇంత వయస్సు వచ్చినా.. చీప్ ట్రిక్స్ ప్రయోగిస్తున్నారని కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ మండిపడ్డారు. గురువారం స్థానిక 9, 10, 36, 37వ డివిజన్లల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం వైసీపీ నాయకుడు నగేష్‌పై కొందరు వ్యక్తులు దాడి చేశారని, ఆ ఘటనను తనకు అంటగట్టే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. 40 ఏళ్లకుపైగా అనంత వెంకటరామిరెడ్డి రాజకీయాల్లో ఉన్నారని, అయన ఇంత దిగజారి తనపై చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన రాజకీయ అనుభవం అంత వయస్సు లేని తనను చూసి ఎందుకు వణికిపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. తన ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఒక సారి తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. తాను ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చానని, ఇది అందరికీ తెలుసునని అన్నారు. తనపై లేనిపోని అసత్యప్రచారాలు చేసినా ఎవరు ఎలాంటి వారో ప్రజలందరికీ తెలుసునన్నారు. 'ఎమ్మెల్యే అనంత నువ్వు గుర్తు పెట్టుకో... కచ్చితంగా నేను నీపై గెలవబోతున్నా.. అధికారంలోకి రాగానే నీవు చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయించి నిజాలు బయటకుతీస్తా..' అని హెచ్చరించారు.

కూటమి మేనిఫెస్టోతో ప్రజాస్పందన రెట్టింపు

ఎన్డీయే కూటమి మేనిఫెస్టో విడుదల చేసిన తర్వాత ప్రజా స్పందన రెట్టింపు అయ్యిందని దగ్గుబాటి పేర్కొన్నారు. మేనిఫెస్టో పథకాలపై అన్ని వర్గాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. డీఎస్సీపై తొలి సంతకం పెడతానని చంద్రబాబు హామీ ఇవ్వడాన్ని యువత స్వాగతిస్తున్నారన్నారు. రైతులు, మహిళలు అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా మేనిఫెస్టోలో పథకాలు చేర్చారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే... అనంత నగరంలో కాలనీల్లోని సమస్యలన్ని పరిష్కరించడంతోపాటు నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలన్న దానిపై పక్కా ప్రణాళికతో ఉన్నామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నటేష్ చౌదరి, గుర్రం నాగభూషణం, పాములరాయి వెంకటేష్, డేగల కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, చంద్ర, మున్వర్, జయరాంరెడ్డి, కృష్ణ, సంగా తేజస్విని, కంఠాదేవి, వడ్డే భవాని, రమాదేవి, రాణి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, వైసీపీ నాయకుడు కృష్ణంరఘు

టీడీపీలో కొనసాగిన చేరికలు

ఐదో డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, వైసీపీ నాయకుడు కృష్ణం రఘుతోపాటు మారుతీప్రసాద్, జనార్థన్, రామాం జినేయులు, రవీంద్రబాబు, శ్రీకాంత్‌లతో పాటు 500 మంది టీడీపీలో చేరారు. దగ్గుబాటి వారిని టీడీపీలో సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ... వైసీపీలో ఎంతో కష్టపడి పనిచేశామని, అయినా తమకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని అన్నారు. అందుకే దగ్గుబాటి నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరామన్నారు.

పలు డివిజన్లల్లో ప్రచారం

దగ్గుబాటి సతీమణి దగ్గుబాటి శ్రీలక్ష్మి 7వ డివిజన్‌లోని నీరుగంటి వీధిలో వసుంధర, కురుబ నారాయణస్వామిలతో కలిసి ఆమె ప్రచారం చేశారు. సాయంత్రం రాజీవ్ కాలనీ పంచాయతీలోని రామయ్య కాలనీ, కళాకారుల కాలనీ, రిక్షా కాలనీల్లో ప్రచారం చేశారు. అలాగే 39వ డివిజన్‌లో కొండవీటి భావన, చేపలహరి, నరేంద్రకుమార్ ప్రచారం చేశారు.





ప్రచారం చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్, దగ్గుబాటి శ్రీలక్ష్మి

మాటిస్తే.. వెనకడుగు వేయం

కూటమి రాప్తాడు అభ్యర్థి పరిటాల సునీత

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: పరిటాల కుటుంబం ఏదైనా మాట ఇచ్చే ముందు ఆలోచిస్తుందే తప్ప... మాట ఇచ్చాక ఇక వెనకడుగు వేసే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తు చేరికలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రాప్తాడు మండలం ప్రసన్నయపల్లి పంచాయతీ నుంచి మాజీ ఎంపీటీసీ శేఖర్, ఈశ్వరయ్య, బండి ప్రసాద్, రమణతో పాటు 250 మంది మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరాయి. అలాగే చెన్నెకొత్తపల్లి మండలం సుబ్బరాయునిపల్లి నుంచి 10 మంది, బద్దలాపురం నుంచి ముగ్గురు, పరిటాల సిద్ధార్థ సమక్షంలో పార్టీలోకి చేరారు. పరిటాల సునీత మాట్లాడుతూ.. వైసీపీలో తగిన న్యాయం జరగలేదని టీడీపీలోకి చేరుతున్నారన్నారు. నమ్మిన వారిని కూడా ప్రకాష్‌రెడ్డి మోసం చేశారన్నారు. అందుకే ఈరోజు ఆయన ఓటమి అంచుల్లో ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం

రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో తోపుదుర్తి మాఫియాతో ప్రజలు విసిగిపోయారని... ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి భారీ మెజార్టీతో గెలుస్తుందని పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. రాప్తాడు మండలంలోని రామినేపల్లి, లింగనపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తోపుదుర్తి సోదరులు మట్టి, ఇసుక, భూ మాఫియా, ఉపాధి పనుల్లో భారీగా దోచుకున్నారని... తాము అధికారంలోకి రాగానే దోచుకున్నదంతా కక్కిస్తామని అన్నారు. ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బొమ్మేపర్తిలో మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, గంగలకుంట రమణ, గోనిపట్ల శీనా, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పరిటాల సునీత

శిల్పాలేపాక్షి నగర్‌లో...

అనంతపురంరూరల్ మండలం ఆకుతోటపల్లి పంచాయతీలోని శిల్పాలేపాక్షి నగర్‌లో పరిటాల సునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు తమ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. నగర్‌లోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు, నాయకుల ప్రచారం...

పరిటాల సునీత పెద్ద కోడలు పరిటాల జ్ఞాన గురువారం అనంతపురంరూరల్ మండలంలోని పాపంపేట పంచాయతీలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే కక్కలపల్లి పంచాయతీలో పరిటాల రవి సోదరి పరిటాల ఉష, పరిటాల శైలాజ నాయకులతో కలసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే కనగానపల్లి మండలంలోని తూముచెర్లలో టీడీపీ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ బంగి రేణుకమ్మ, మాజీ ఎంపీటీసీలు యాతం మల్లికార్జున, ఆదెప్ప, ముకుందనాయుడు, బోర్లచెన్నప్ప, హరి, నరసప్ప, బట్టాసురేష్‌చౌదరి పాల్గొన్నారు.



బొమ్మేపర్తిలో పరిటాల సునీతకు గజమాలతో సన్మానం



పాపంపేట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరిటాల జ్ఞాన

శ్రావణి గెలుపుతోనే శింగనమల అభివృద్ధి



బండ్లపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆలం నరసానాయుడు

బుక్కరాయసముద్రం, మే 2: కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గెలుపుతోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వస్తే సామన్య ప్రజల జీవనం సాగించలేరన్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.

- బుక్కరాయ సముద్రం మండల పరిధిలోని పొడరాళ్ల గ్రామం, బుక్కరాయసముద్రం గ్రామ పంచా యతీలో జనచైతన్య, ఎల్‌బీ రామిరెడ్డి కాలనీ లలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, ఓబులపతి, ఎస్‌నారాయణస్వామి, కేశన్న, లక్ష్మీనారాయణ తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.
- నార్పల మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, జిల్లా టీడీపీ నేత ఆలం వెంకట నరసా నాయుడు, ఆకుల అంజినేయులు తదితర టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం చేశారు.
- గార్లదిన్నె మండ లంలోని తిమ్మంపేట, అంకంపేట, రాందాస్ కొత్తూరు, కొత్తపల్లి గ్రామాల్లో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసులరెడ్డి, బండారు శ్రావణిశ్రీ సోదరి కిన్నెరశ్రీ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ, గుత్తా బాలకృష్ణ, నరసింహారెడ్డి, అంజి, బాబయ్య, గుర్రం శీను, రామాంజి, శివశంకర్‌రెడ్డి తదితర టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం చేశారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు మండలంలో శుక్రవారం కొడవండ్లపల్లి, ఆరవేడు బుక్కాపురం కూచివారిపల్లి, వాసాపురం, అచ్యుతాపురం, చిలంకూరు, కొడుమూర్తి యల్లనూరు గ్రామల్లో బండారు శ్రావణిశ్రీ ప్రచారం నిర్వహిస్తారు.



పొడరాళ్ల గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ప్రచారం

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుదాం: ఆర్ఎం

అనంతపురం కల్చరల్, మే 2: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆదాయాన్ని వృద్ధి చేసి రీజియన్‌ను రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషిచేద్దామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సిబ్బందికి సూచించారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలో రీజియన్‌లోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్చార్జిలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి బస్సు రూట్‌కు వెళ్లకముందే పనితీరును సమీక్షించి ఉండాలని, సెక్టార్ వారీగా పనితీరు బాగాలేని సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని సూచించారు. కార్గో రవాణాలో ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని, కార్గో సర్వీసుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. స్వీకరించిన పార్శిళ్లను సకాలంలో డోర్ డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని, వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా బస్సుల్లో కేఎంపీఎల్‌ను పెంచడం తోపాటు బ్రేక్‌డౌన్‌లను తగ్గించి, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డీఎంలు నాగభూపాల్, జీఎల్ శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, నారాయణస్వామి, బాలాజి దయాల్, పీఓ చెంద్రాయుడు, ట్రాఫిక్ ఇన్చార్జి రమణమ్మ, ఎస్టీఐ నాగార్జున, ఏఎంఎఫ్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని

కేన్సర్ చికిత్సకు రోబోటిక్ సర్జరీ ఉత్తమం

వైద్యకళాశాల సదస్సులో డాక్టర్ మొహమ్మద్ షాహీద్

అనంతపురం టౌన్, మే 2: కేన్సర్ చికిత్సకు రోబోటిక్ సర్జరీ చాలా ఉత్తమమని ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ మొహమ్మద్ షాహీద్ తెలిపారు. గురువారం వైద్యకళాశాలలో రోబోటిక్ సర్జరీలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వెన్నెముక, యూరాలజీ, గైనకాలజీ, అన్నిరకాల కేన్సర్ సర్జరీలకు రోబోటిక్ సర్జరీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మినీమల్లి ఇన్వేష్ విధానంలో ఓపెన్ సర్జరీలు అవసరమైన అన్ని సమయాలలో రోబోటిక్ సర్జరీ ద్వారా తక్కువ సమయంలో శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాల రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్లు సారోన్ సోనియా, నవీన్‌కుమార్, రామస్వామి నాయక్, శివశంకర్‌నాయక్, సుత్రా, ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.



వైద్యుడు షాహీద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

ఓటు హక్కు వినియోగంపై యువత ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న యువత

అనంతపురం క్లాక్‌టవర్, మే 2: ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యతపై స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ కార్యాలయంలో యువకులు ప్రతిజ్ఞ చేశారు. గురువారం స్థానిక రెడ్‌క్రాస్‌లో ఓటరు ఎడ్యుకేషన్, స్వీప్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి మోహన్‌కృష్ణ, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, కార్యదర్శులు నందిత, మహేంద్ర, పవన్, మంజుల, ఎన్‌వైకే కార్యకర్తలు జయమారుతి, దివ్య పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అమ్మ చేయూత

అనంతపురం కల్చరల్, మే 2 : నగరంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న ఆంజనేయులుకు అమ్మ సంస్థ చేయూత అందించింది. ఆంజనేయులు భార్య గొల్లక్క 15 సంవత్సరాలుగా తోపుడుబండిపై చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేది. భర్త ఆంజనేయులుకు కడుపునొప్పి రావడంతో వైద్యులను సంప్రదించగా బెంగుళూరుకు రెఫర్ చేశారు. అక్కడ ఆంజనేయులు కడుపులో పాంక్రియస్‌లో ఇన్ఫెక్షన్ అయి గడ్డలుండడంతో ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం రూ.2.5 లక్షలు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో తమవద్ద ఉన్న తోపుడుబండి విక్రయించి రూ.20వేలు మాత్రమే సమకూర్చుకోగలిగారు. మిగిలిన సొమ్ము కోసం దాతల సహకారాన్ని కోరుతూ అమ్మసంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆంజనేయులు ఆపరేషన్ కోసం అమ్మ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆ కుటుంబాన్ని కలిసి రూ.2లక్షలు చెక్కును, దారి ఖర్చుల కోసం మరో రూ.5 వేలను అందజేశారు.



చెక్కు అందజేస్తున్న రమణారెడ్డి

పెద్దమ్మ ఆలయానికి ఒడిబియ్యం సమర్పణ

అనంతపురం కల్చరల్, మే 2: పుట్టినిల్లు ఆశ్రమం, నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నవయుగ కాలనీలోని పెద్దమ్మ దేవాలయంలో గురువారం ఒడిబియ్యం సమర్పించారు. ఆ ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలా మురళి ఆలయ నిర్వాహకుడు రాజుకు అమ్మవారి ఒడిబియ్యం అందించారు. భక్తులకు అన్నదానం చేసేందుకు 29 రకాల నిత్యావసర వస్తువులు, రూ.2500 నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు భారతి, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఒడి బియ్యం సామగ్రిని అందజేస్తున్న నిర్మలా మురళి

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం కల్చరల్, మే 2 : హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 216 మంది యాత్రికుల కోసం గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ఆడిటోరియంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. 208 మంది యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించుకున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ ఆ కార్యక్రమాన్ని పరిశీలించారు. హజ్ యాత్రికులకు తగు జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. గురువారం వ్యాక్సినేషన్‌కు గైర్హాజరైనవారు శుక్రవారం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 25 లోపు యాత్ర చర్యలు చేపట్టనున్నట్లు హజ్ కమిటీ జిల్లా కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్ వెల్లడించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ప్రతినిధి షేక్ నూరుద్దీన్, ఎంఏ మునీర్ బాషా, జాఫర్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోపై హర్షం

ఆత్మకూరు, మే 2: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాలకూ న్యాయం చేసేలా ఉందని నాయిబ్రాహ్మణ రాష్ట్ర సాధికార కమిటీ సభ్యుడు ఆనంద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... దేవాలయాల్లో పని చేస్తున్న నాయిబ్రాహ్మణలకు రూ. 25 వేలు గౌరవ వేతనం, క్షవర శాలలకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితం అందిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి నాయిబ్రాహ్మణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నిఘానేత్రం చోరీ..!

- పెద్దాస్పత్రిలో కొనసాగుతున్న చోరీలు
- పట్టించుకోని అధికారులు
- నేడు ఏకంగా 60 ఇంచుల సీసీ కెమెరాల మానిటర్ మాయం

అనంతపురం టౌన్, మే 2: జిల్లా సర్వజన ఆస్పత్రిలో దొంగతనాల పరంపర కొనసాగుతూనే ఉంది. మరో దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దొంగతనాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటర్‌నే ఆ దొంగలు ఎత్తుకెళ్లారు. ఆ మానిటర్ ఏదో 24 ఇంచులు.. 28 ఇంచులు.. 32 ఇంచులది కాదు... ఏకంగా 60 ఇంచులది. ఇలా రూ. 70 వేలు విలువైన 60 ఇంచుల మానిటర్‌నే దొంగలు ఎత్తుకుపోయారంటే.. ఆస్పత్రిలో భద్రతా చర్యలు ఏ మాత్రం ఉన్నాయో ఇట్టే అర్థం అవుతుంది. ఈ విషయం బయటకు రాకుండా తొక్కి పెట్టడానికి ప్రయత్నించినా.. చివరకు వెలుగులోకి రావడంతో పెద్ద దుమారం రేపుతోంది. ఇక వివరాల్లోకి వెళితే... ఆస్పత్రిలో దొంగతనాలను అరికట్టడానికి, వైద్యుల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి గత కొద్ది నెలలుగా పనిచేయక పోవడంతో పర్యవేక్షణ కొరవడింది. మరోవైపు దొంగతనాలూ ఎక్కువయ్యాయి. రోగులు, డాక్టర్లు, నర్సులకు సంబంధించిన అనేక బైకులు, పర్సులు, బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఇటీవల కాలంలో క్యాజువాలిటీలో విలువైన బ్యాటరీలు చోరీ అయ్యాయి. ఆక్సిజన్ సరఫరా చేసే ప్లాంటులకు ఏర్పాటు చేసిన విలువైన పరికరాలూ చోరీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలను పునరుద్ధరించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వైజాగ్‌కు చెందిన టెక్నీషియన్లకు ఆ బాధ్యతలను అప్పగించారు. వారు సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు రెండు మానిటర్లను ఈ ఏడాది జనవరిలో తీసుకొచ్చి ఆర్ఎంఓల చాంబర్‌లో భద్రపరిచి వెళ్లారు. వాటిని ఇన్‌స్టాల్ చేయడానికి పది రోజుల క్రితం వారు చూడగా అందులో రూ 70 వేలు విలువ చేసే ఒక మానిటర్ కనిపించలేదు. ఈ విషయాన్ని వారు వెంటనే ఆస్పత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆ అధికారు లు ఈ విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా ఉంచుతూ వచ్చారు. ఆ దొంగలకు కొంత మంది వైద్యులు, హెచ్ఓడీలతో మంచి సంబంధాలు ఉండటంతో వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలూ ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టరు, జేసీ స్పందించి... ఆ ఇంటి దొంగలను పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది, రోగులు కోరుతున్నారు.





మానిటర్ చోరీకి గురైన ఆర్ఎంల చాంబర్ ఇదే

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆర్ఎంఓల చాంబర్‌లో భద్రపరిచిన 60 ఇంచుల మానిటర్ (ఎల్‌జీ టీవీ) కనిపించకుండా పోయిన విషయం వాస్తవమే. దాని విలువ రూ70 వేలు. ఈ దొంగతనంపై అనేక అనుమానాలున్నాయి. అందుకే పది రోజుల క్రితమే టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఎన్నికల వేళ కావడంతో కొంత ఆలస్యం అవుతోంది. తప్పకుండా పోలీసుల సహకారంతో దొంగలను పట్టుకుంటాం, చర్యలు తీసుకుంటాం

\- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

ఎన్‌డీఏ గెలుపుతోనే మాదిగలకు న్యాయం

అనంతపురంరూరల్, మే 2: ఎన్‌డీఏ గెలుపుతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ అన్నారు. గురువారం మండలంలోని రాచనపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీ, అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీలో ఆయన ఎన్‌డీఏకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం దళితులకు సామాజిక హోదా ఇచ్చే భూమి కొనుగోలు పథకం రద్దు చేసిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీతో ఇచ్చే ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, కార్లు, ఇతరాత్ర వాటిని అందించకుండా మరింత ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఎన్‌డీఏకు మద్దతుగా నిలిచి మాదిగల హక్కులను కాపాడుకుందామన్నారు.

ఎమ్మెల్యే అక్రమాలను ప్రజలకు వివరిద్దాం

అనంతపురం క్లాక్‌టవర్, మే 2: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి, వారి కుటుంబ సభ్యులు చేసిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించి... వైసీపీని ఓడిస్తామని ఎస్సీ, ఎస్టీ ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మద్దెలచెరువు మల్లి అన్నారు. గురువారం ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అవినీతి, అక్రమాలతో రాజ్యమేలుతున్నారని విమర్శించారు. శింగనమలలో సాంబశివారెడ్డిని ఓడించాలని ప్రజలను కోరారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి

అనంతపురంరూరల్, మే 2: వ్యాపారులు ఫుడ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పండ్ల వ్యాపారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యార్డులో పండ్ల వ్యాపారులు పండ్లను మగ్గపెట్టడానికి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చూచించిన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో యార్డు కార్యదర్శి రూపాకుమార్, సూపర్‌వైజర్లు కేశవ్ కుమార్, పండ్ల వ్యాపారులు, ఆసంఘం సభ్యులు పాల్గొన్నారు.


శెట్టూరులో టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని


మైనార్టీ నాయకుడికి కండువా వేస్తూ...


టీడీపీలోకి చేరిన మహిళా కార్యకర్తలతో సురేంద్రబాబు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

- ఒకేరోజు 250 వైసీపీ కుటుంబాల చేరిక
- 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తాం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని

కళ్యాణదుర్గం, మే 2: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రోజురోజుకు అమిలినేని సురేంద్ర బాబుకు ఆదరణ పెరుగుతోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు సాగుతున్నాయి. 250 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలోకి చేరారు. వీరందరికీ అమిలినేని సురేంద్రబాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు, మున్సిపల్ పరిధిలోని రాచప్పకుంట, మారెంపల్లి, ఎన్టీఆర్ కాలనీలకు చెందిన 60 కుటుంబాలు, చాపిరిలో 22, మున్సిపాలిటీలని ఎన్టీఆర్ కాలనీకి చెందిన 23 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. అలాగే కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన 28 వైసీపీ ముస్లిం కుటుంబాలు, మలయనూరు నుంచి 12, శెట్టూరులో వైసీపీ నాయకుడు అబ్దుల్లాతో పాటు 53 వైసీపీ కుటుంబాలు చేరారు. మున్సిపల్ పరిధిలో 17, 18 వార్డులకు చెందిన 23 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా పరిశ్రమలు స్థాపించి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా ఆదుకునేందుకు ముందుంటానని హామీ ఇచ్చారు. టీడీపీపై ప్రజల నుంచి అపూర్వ ఆదారణ లభిస్తోందన్నారు. ఏ గ్రామంలో చూసినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 13వ తేదీన సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని విన్నవించారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీ పాలనకు స్వస్తి పలికి చంద్రబాబు పాలన కోరుకోవాలని కోరారు. అప్పుడే అభివృద్ధికి బాటలు వేయడం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ హయాంలోనే మహిళలకు పెద్దపీట వేశామన్నారు. గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పల్లె ప్రాంతాల్లో అధికంగా జీవిస్తున్నారని వారందరికీ సముచిత న్యాయం జరగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

అమిలినేనిని గెలిపించండి: కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు గెలిస్తేనే అభివృద్ధికి బాటలు వేసేందుకు అవకాశం ఉంటుందని రాయదుర్గం ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కాపు సొంత ఊరిలో మొదటిసారిగా అమిలినేని ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. సురేంద్రబాబును గెలిపించాలని గ్రామస్థులకు విన్నవించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓటెయ్యండి: గుమ్మనూరు

గుంతకల్లు, మే 2: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓటేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని గుమ్మనూరు జయరాం ఓటర్లను కోరారు. పట్టణంలోని 29, 30 వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఓటర్లకు కరపత్రాలను అందజేశారు. రాష్ట్రాభివృద్ధికి, యువతకు ఉద్యోగావకాశాలకు, రాజధాని నిర్మాణం, ప్రాజెక్టులను పూర్తి చేయడానికి చంద్రబాబు నాయుడి అవసరం ఉందన్నారు. టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, అంజి, పాల్గొన్నారు. సాయంత్రం మహేంద్ర కళ్యాణ మండపంలో చర్చి పాస్టర్లతో జయరాం సమావేశమయ్యారు. ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. పట్టణంలోని 25వ వార్డులో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి సమక్షంలో 50 మంది ఏకలవ్య సంఘ సభ్యులు, 32వ వార్డులో 30 మంది రజక కుటుంబాలవారు టీడీపీలో చేరారు. గుమ్మనూరు శ్రీనివాసులు మండలంలోని దోనిముక్కల, మల్లేనిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

గుత్తి: పట్టణంలోని 14వ వార్డులో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాంను గెలపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


29వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న జయరాం

గుత్తిరూరల్: ఎన్నికల్లో గుమ్మానూరు జయరాంను గెలిపించాలని గుమ్మానూరు సోదరులు గ్రామాల్లో ప్రచారం చేశారు. గురువారం మండలంలోని పూలకుంట, బ్రహ్మణపల్లి, ఈశ్వరపల్లి గ్రామాల్లో శ్రీనివాసులు, నారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు సమ న్యాయం జరుగుతుందని, చంద్రబాబు నాయుడు సీఎం అయితే రాష్ట్రం బాగుటుందన్నారు. మండల కన్వీనర్ బర్దీవలి, చిన్నరెడ్డి యాదవ్, రామచంద్ర, సూరి, గోవర్దన్ గౌడ్, సాంబశివ, నారాయణ స్వామిప్రతాప్, గోవిందు పాల్గొన్నారు.

నన్ను గెలిపిస్తే.. మీ పాలేరులా పనిచేస్తా..

- కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, మే 2: తనను గెలిపిస్తే... మీ పాలేరుగా పనిచేస్తానని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం బ్రహ్మసముద్రం గ్రామంలో జనసేన ఇన్‌ఛార్జ్ మంజునాథ్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ ప్రాంతంలోని రైతులు హెచ్చెల్సీ ఆయకట్టుపై ఆధారపడి జీవిస్తున్నారని, తాను మంత్రిగా ఉన్నప్పుడు సాగునీరు రావడానికి కృషి చేశానన్నారు. ఇక్కడి ప్రజలు తనకు సక్రమంగా ఓట్లు వేయలేదన్నారు. అయినా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవ కోసమే ఉంటానని ఈ ఎన్నికల్లోనైనా తనకు పూర్తి మద్ధతు పలకాలని ఆయన కోరారు.

వీరశైవ లింగాయతుల అభివృద్ధికి కృషి: వీరశైవ లింగాయతుల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం కణేకల్లులోని బసవేశ్వరరైస్ మిల్లులో వేలూరు మరియప్ప ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి దారి చూపిన మహనీయుడు బసవేశ్వరుడని అటువంటి జాతిలో పుట్టిన వీరశైవలింగాయతులు ధర్మానికి నిలువెత్తు రూపమన్నారు. లింగాయతులను ఓబీసీల్లో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

టీడీపీలో చేరిక




మాట్లాడుతున్న కాలవ

బ్రహ్మసముద్రానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. కాలవ శ్రీనివాసులు సమక్షంలో స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశులు, వైసీపీ వార్డు మెంబర్ వన్నూరుస్వామి, షణ్ముఖ, తిమ్మప్ప, రామకృష్ణ, శివప్పతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

రాయదుర్గం: వైసీపీకి చెందిన హౌసింగ్ డైరెక్టర్ పాల శీనా గురువారం టీడీపీలో చేరారు. ఆయనతోపాటు నారాయణస్వామి, జకాతి కిష్టలతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. బలిజలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణమంటపంలో బలిజ కులస్థులతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రావడానికి సహకారం అందించాలని కోరారు. బలిజల కళ్యాణమంటపానికి అన్ని విధాల ఆర్థికంగా చేయూతనిందిస్తానన్నారు. పట్టణంలోని 19, 22వ వార్డులలో గురువారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తనను ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కుటుంబసభ్యుల ప్రచారం: కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ గురువారం గుమ్మఘట్ట మండలంలోని బేలోడు, వైద్యం గుండ్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కుమార్తె కాలవ గౌతమి కణేకల్లు మండలంలోని పుల్లంపల్లి, గోపులాపురం గ్రామాల్లో, అల్లుడు అనిల్ డీ.హీరేహాళ్ మండలం మలపనగుడి గ్రామంలో ప్రచారం చేశారు.

కాలువలకు నీళ్లు ఇవ్వలేని నాయకుడు విశ్వ

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్


రోడ్‌షోలో మాట్లాడుతున్న కేశవ్

ఉరవకొండ, మే 2: తప్పిన కాలువలకు తూములెత్తి నీళ్లు ఇవ్వలేని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అని ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలంలోని కోనాపురం, చిన్నముష్టూరు, లత్తవరం, లత్తవరం తండా, షేక్షానుపల్లి, రాచర్ల, రాచర్ల తండా గ్రామాలలో గురువారం కేశవ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. నాయకులు గజమాలతో సత్కరించారు. కేశవ్ మాట్లాడుతూ పనిచేసే వారికే ప్రజలు పట్టం కట్టాలన్నారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఐదేళ్లలో విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది చదువుతున్న పిల్లలున్నా రూ.15వేలు ఇస్తామన్నారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, పురుషోత్తం, మాజీ ఎంపీపీలు కుళ్లాయప్ప, నాగేశ్వరరరావు, మాజీ సర్పంచు గోవిందు, నెట్టెంరాంబాబు, మదమంచి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ వన్నూరుస్వామి, ఓబన్న పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనను సాగనంపేందుకు సిద్ధం: రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో జనసేన, టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసీపీని సాగనంపాలన్నదే కూటమి లక్ష్యమన్నారు. ప్రతిపక్ష ఓట్లు చీలకూడదన్న లక్ష్యంతోనే జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తు కుదుర్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం నిలబడిన వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. వైసీపీ నాయకుల వేదింపులతో పరిశ్రమలు జిల్లా నుంచి తరలిపోయాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రేగాటి నాగరాజు, జనసేన నాయకులు చంద్రశేఖర్, కేశవ, గోపాల్, నగేష్, రాజేష్, దేవేంద్ర పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంలోని గూళ్లపాళ్యం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు.

కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నుంచి పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. చేరిన వారిలో కందేపల్లి చిన్నకేశవులు, కందేపల్లి ఈశ్వరయ్య, కందేపల్లి మారుతీ టీడీపీలో చేరారు.


టీడీపీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

బిడ్డకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

- కుమారుడు మృతి

బొమ్మనహాళ్, మే 2: కడుపునొప్పితో బాధపడుతున్న ఓ తల్లి తాను చనిపోతే బిడ్డను ఎవరు చూసుకుంటారని 18 నెలల పసికందుకు విషమిచ్చి, తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విసం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని కళ్లదేవనహళ్లి గ్రామానికి చెందిన చాకలి తిప్పయ్య కుమార్తె అశ్విని(23)ని ఆరేళ్ల క్రితం డీ.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి 18 నెలల శశాంత్ అనే బాబు ఉన్నాడు. ఏప్రిల్ 30న కడుపునొప్పి ఉందని కళ్లదేవనహళ్లి గ్రామంలో ముందుగా 18 నెలల కుమారుడికి విషమిచ్చి, అశ్విని కూడా తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శశాంత్ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. అశ్విని పరిస్థితి కూడా విషమంగా ఉందన్నారు. శశాంత్ మృతి చెందడంతో తల్లిపై హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీకి అస్వస్థత

యల్లనూరు, మే 2: మండలంలోని జంగంపల్లి గ్రామంలో పాముకాటుకు గురై మహిళా కూలీ మంజుల అస్వస్థతకు గురయ్యారు. వివరాలమేరకు మంజుల గురువారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తోటకు వెళ్లింది. పనులు చేస్తుండగా పామును తొక్కడంతో కాటు వేసింది. వెంటనే అక్కడున్న కూలీలు మంజులను యల్లనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి నుంచి 108వాహనంలో తాడిపత్రికి అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యల్లనూరు ఆసుపత్రిలో పాముకాటు వ్యాక్సిన్ ఉండడంతో వెంటనే వేసినట్లు డాక్టర్ సాయి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

కళ్యాణదుర్గంరూరల్, మే 2: మండలంలోని మల్లికార్జునపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం పరశురాంపురం గ్రామానికి చెందిన గొల్ల కిరణ్ (17) అనే యువకుడు ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొన్నాడు. తెల్లవారుజామున అటుగా వెళ్లిన ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, మే 2: బొమ్మనహాళ్ మండలం గౌనూరు గ్రామానికి చెందిన పరమేష్(42) అనే వ్యక్తి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పరమేష్ బుధవారం రంగాపురం క్యాంపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు బళ్లారివిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై మోసం చేసిన జగన్

రాయదుర్గంరూరల్, మే 2: మాదిగల ఎస్సీ వర్గీకరణ చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథస్‌మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నా ఏ పార్టీ పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

గుంతకల్లుటౌన్, మే 2: పట్టణంలోని బెస్తకాలనీలో నివాసముంటున్న మహబుబ్ దౌలా, రమీజా దంపతుల కుమారుడు జీశంత్(4) గురువారం నీటి సంపులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు మహబుబ్‌దౌలా ఆటో నడుపుతుండగా, భార్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి ఆరేళ్లు కుమార్తె అయేషా, నాలుగేళ్ల జీశంత్ ఉన్నారు. ఉదయం తాగునీరు రావడంతో ఇంటి ఆవరణంలో ఉన్న సంపులో నీటిని పట్టారు. సంపుపై ఉన్న బండను మూయడం మరిచిపోయారు. బాలుడి తల్లి రమీజా, అతని నాయనమ్మ పనులకు వెళ్లారు. ఇంట్లో బాలుడు తండ్రి మహబుబ్‌దౌలా ఉన్నారు. అయేషా, జీశంత్‌లు ఆడుకుంటున్నారు. ఆడుకుంటూ జీశంత్ నీటి సంపులో పడ్డాడు. గుర్తించిన అయేషా గట్టిగా కేకలు వేస్తూ జీశంత్ సంపులో పడ్డాడని తండ్రికి చెప్పింది. తండ్రి బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కసాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజలకు అండగా ఉంటా: అశ్మిత్‌రెడ్డి

యాడికి, మే2: ప్రజలకు అండగా ఉంటా... అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని, ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కూటమి తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పుప్పాల, నగరూరు, వేములపాడు, చందన, రాయలచెరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. అయన మాట్లాడుతూ సైకో పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ పడకేసిందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ప్రజలకు కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరకడం లేదన్నారు. గ్రామ పంచాయతీల నిధులను ప్రభుత్వం దోచేయడంతో వీధిలైట్లు కూడా వెలగని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరాడు. రోడ్‌షో సందర్బంగా జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రసంగాన్ని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి విన్నారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు పరిమి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి వస్తే మీ భూములన్నీ గోవిందా: ఈసారి జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మీ భూములన్ని గోవిందా... గోవిందానే అని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అశ్మిత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో పాల్గొన్న


రోడ్‌షోలో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పేరుతో జగన్ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువస్తోందన్నారు. ఈసారి మళ్లీ జగన్ వస్తే మీ భూములు అన్ని గోవిందా అని తెలిపారు.

విరాజ్‌రెడ్డి ప్రచారం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ దీపకరెడ్డి కుమారుడు విరాజ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించి వాటిలోని అంశాలను ప్రజలకు వివరించారు. కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, విజ్జి, టీడీపీ నాయకులు అనిఫ్, నాగరంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ: అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ అని జేసీ పవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులోని పలు ప్రాంతాలు, బుడగజంగాల కాలనీల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ జింకా లక్ష్మిదేవి, వేలూరు రాజశేఖర్‌నాయుడు, ఖాదర్‌బాషా, వేణు, సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

మండుటెండలో అవ్వాతాతలకు అవస్థలు


మండుటెండలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కూడేరు, మే 2: ఎన్నికల వేళ ఓట్ల కోసం వైసీపీ ప్రభుత్వం అవ్వాతాతల విషయంలో రోజుకో నాటకం ఆడుతుంది. తమకు అనుకూలంగా ఓట్లను మలుచుకోవడానికి విపక్షాలపై నిందలు మోపి పబ్బం గడుపుకోవడానికి అవ్వాతాతలను మండుటెండలో నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. గత నెల సచివాలయాలలో పింఛన్ సొమ్మును అందుకున్న వారు, ఈనెల బ్యాంక్ అకౌంట్లకు జమ చేయడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వృద్ధులు నానా అవస్థలు పడి మండల కేంద్రానికి చేరుకున్నారు. కడదరకుంట గ్రామానికి చెందిన నారాయణ అనే పింఛన్‌దారుడు మండుటెండలో నిలబడాల్సిరావడంతో ఇదేం ప్రభుత్వం ఇలాగేనా చేసేదీ...అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా దాదాపు 5724 పింఛన్లు ఉండగా, 4027 మందికి బ్యాంక్ అకౌంట్‌కు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 1697 మందికి అకౌంట్లు లేవని అలాంటి వారికి ఇంటి వద్దకు వెళ్లి ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

పుట్లూరు, మే2: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో గురువారం రాత్రి పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారని ఆరాతీశారు. ఆయన వెంట ఈఓఆర్‌డీ ఆనంద్, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు.

యల్లనూరు: మండలంలోని నీర్జాంపల్లి పోలింగ్‌స్టేషన్‌ను గురువారం కలెక్టర్ పరిశీలించారు. మారుమూలగ్రామమైన నీర్జాంపల్లిలో పోలింగ్ సౌకర్యాలపై ఆరాతీశారు.

అవ్వా.. ఒకసారి అవకాశం ఇవ్వండి

- ప్రచారంలో బండారు శ్రావణిశ్రీ


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న శ్రావణిశ్రీ

యల్లనూరు, మే 2: అవ్వా, తాత ఒకసారి అవకాశం ఇవ్వాలని శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అభ్యర్థించారు. మండలంలోని వెంకటాద్రిపల్లి, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి, దుగ్గుపల్లి, గడ్డం వారిపల్లి గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అభ్యర్థించారు. ఆమె వెంట రామాంజనేయులు, అనిల్‌కుమార్, బొప్పేపల్లి రవీంద్రారెడ్డి, చల్లా చంద్రశేఖర్, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, సుబ్బరాయుడు, కుల్లాయప్పనాయుడు ఉన్నారు.

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గురువారం టీడీపీ నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సమక్షంలో టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, జనార్దనరెడ్డి, చలపతి, రామయ్య ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్, మే2: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు టీషర్టు ధరించాడని మూడురోజులక్రితమే మరణించి ఉంటాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. 40సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.


పింఛన్‌దారులతో కిటకిటలాడుతున్న సీకేపల్లి కెనరాబ్యాంక్

పింఛన్ కోసం పాట్లు

చెన్నేకొత్తపల్లి, మే 2: పింఛన్ డబ్బుల కోసం బ్యాంకుల వద్దకు చేరుకున్న వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం మండలంలోని పలు బ్యాంకుల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పింఛన్ కోసం క్యూకట్టారు. గ్రామాల నుంచి వృద్ధులను ఆటోలలోనూ, మరికొంతమంది ద్విచక్రవాహనాలలో బ్యాంకుల వద్దకు తీసుకువచ్చారు. ఎండ వేడిమి, ఉక్కబోతతో వృద్ధులు విలవిలలాడారు. కొన్ని బ్యాంకుల వద్ద ఎలాంటి సౌకర్యాలూ కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన

బుక్కరాయసముద్రం, మే 2: మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన వెంకటాపురం, చెన్నంపల్లి, కేకే అగ్రహారం గ్రామాల్లో ఎస్పీ అమిత్ బర్దర్ గురువారం పర్యటించారు. వాటిల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ వెంకటేశులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

బుక్కరాయసముద్రం, మే 2: మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వడ్డేమద్దిలేటి రెండు రోజుల క్రితం ట్రాక్టర్ బోల్తాపడి మరణించాడు. గురువారం బాధిత కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టీడీపీ నేతలు పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కన్వీనర్ అశోక్, పెద్దప్ప, లక్ష్మినారాయణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

నార్పల, మే 2: స్థానిక జూనియర్ కళాశాల, పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్, తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీఓ రాముడు, ఉన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

6న ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, మే 2: ఐటీఐ పాసైన విద్యార్థులకు సోమవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఒక సంవత్సరం శిక్షణ ఇస్తారని, ఇందులో మొదటి మూడు నెలలు రూ.10 వేలు, తరువాతి తొమ్మిది నెలలు రూ.11 వేల చొప్పున జీతం చెల్లిస్తారని అన్నారు. అనంతరం శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలని, వివరాలకు 96189 16029ను సంప్రదించాలని సూచించారు.

నామినేషన్ల పర్వం ప్రారంభం

అనంతపురం క్రైం, మే 2: అనంతపురం బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు అధ్యక్ష స్థానానికి బడా నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, గురుప్రసాద్ నామినేషన్లు వేశారు.

5 నుంచి హాకీ శిక్షణ శిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, మే 2: వేసవి ఉచిత హాకీ శిక్షణా శిబిరాన్ని ఆదివారం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ కోచ్‌లు గోకుల్‌కుమార్, పరమేష్ తెలిపారు. విశ్రాంత డీఎస్‌డీఓ, హాకీ చీఫ్‌కోచ్ రమణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణను 8-15 ఏళ్ల వయస్సుగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99595 15000, 89855 99135ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్, మే 2: నగరంలో హెచ్‌ఎల్‌సీ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త 33కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మత్తుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మినారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంగానగర్, శ్రీశ్రీ నగర్, బళ్లారి రోడ్డు, రుద్రంపేట, రాంనగర్, లక్ష్మీనగర్, కోవూరు నగర్, మొదటి నుంచి ఆరో రోడ్డు వరకు, ఆజాద్‌నగర్, శ్రీనగర్ కాలనీ, ప్రహల్లాదనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

టీడీపీ మండల ప్రధాన కార్యదర్శికి మాతృవియోగం

అనంతపురంరూరల్ : టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాములురాయి రఘు మాతృమూర్తి జయలక్ష్మమ్మ (79) గురువారం మరణించారు. మాజీ మంత్రి పరిటాల సునీత జయలక్ష్మమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ కాపుకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాములురాయి వెంకటేష్, చియ్యేడు లక్ష్మినారాయణ, విశ్వనాథ్, రాగేమురళీ మోహన్ ఉన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురంరూరల్, మే 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,152 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డీబార్

అనంతపురం సెంట్రల్, మే 2: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం ఆరుగురు విద్యార్థులు డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ జీవీ రమణ తెలిపారు. రెండు, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలలో ముగ్గురు, శ్రీనివాస కళాశాలలో ఇద్దరు, గుత్తి సాయి కళాశాలలో ఒకరు డీబార్ అయ్యారన్నారన్నారు.